



జన్మదినాన శ్రీవారి సన్నిధిలో

మెగాస్టార్ చిరంజీవి తన పుట్టినరోజు సందర్భంగా గురువారం కుటుంబ సమేతంగా తిరుమల వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. వేకువజామున సంప్రదాయ వస్త్రధారణతో సుప్రభాత సేవలో పాల్గొన్నారు. ఆలయం లోపల, బయట పలువురు యాత్రికులు చిరంజీవిని చూసి సంబరపడ్డారు. సెల్ఫీలు దిగేందుకు పోటీపడ్డారు. - తిరుమల, ఆంధ్రజ్యోతి

గ్రామాల్లో సమస్యలను గుర్తించండి

- పంచాయతీల్లో నేటి సభలపై కలెక్టర్ ఆదేశం

తిరుపతి(విద్య), ఆగస్టు 22 : జిల్లావ్యాప్తంగా పంచాయతీ కేంద్రాల్లో నేడు నిర్వహించనున్న గ్రామసభల్లో పల్లెసీమల్లో నెలకొన్న సమస్యలను గుర్తించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో ఆయన బుధవారం గ్రామసభల నిర్వహణపై సమీక్షించారు. ఉపాధి హామీ పనులపై అవగాహన కల్పించాలని, గ్రామాల్లో కనీస సౌకర్యాలైన రోడ్లు,విద్య, వైద్యం, తాగునీరు, విద్యుత్తు అంశాలపై చర్చించాలన్నారు. ప్రతి గ్రామాన్నీ స్వర్ణగ్రామంగా తయారు చేయడానికి గ్రామ విజన్ డాక్యుమెంట్ తయారు చేయాలని ఆదేశించారు. ప్రజాప్రతినిధులందరూ ఈ సభల్లో పాల్గొనేలా చూడాలన్నారు.



చంద్రయాన్-3 రాకెట్

- నేడు జాతీయ అంతరిక్ష దినోత్సవం

54 ఏళ్ల కిందట బుడిబుడి అడుగులతో ప్రారంభమైన భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) ప్రయాణం నేడు అంతర్జాతీయస్థాయిలో ప్రశంసలందుకునే స్థాయికి ఎదిగింది.ఇస్రో ప్రయోగించే రాకెట్ల నుంచి ఉపగ్రహాలను పంపేందుకు ఎన్నో దేశాలు క్యూ కడుతున్నాయి.1969లో తుంబా నుంచి చిన్నచిన్న సౌండింగ్ రాకెట్లతో ప్రయోగాలకు శ్రీకారం చుట్టిన ఇస్రో తొలి ఉపగ్రహం ఆర్యభట్ట ప్రయోగంతో నిర్ణయాత్మక దశకు చేరింది.అక్కడినుంచి చంద్రయాన్-3 ప్రయోగ విజయం వరకూ ఎన్నో మార్లు దేశ కీర్తి ప్రతిష్టలను ప్రపంచ దేశాలకు చాటిచెప్పింది.ఇస్రో చరిత్రలో గొప్ప మైలురాయి చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతం కావడమే కాకుండా గత ఏడాది ఆగస్టు 23న చంద్రయాన్-3లో పంపిన ప్రజ్ఞాన్, రోవర్ చంద్రుడిపై సేఫ్‌గా ల్యాండ్ కావడంతో దేశంలో సంబరాలు ప్రారంభమయ్యాయి. దీంతో ఆ రోజును భారత ప్రభుత్వం జాతీయ అంతరిక్ష దినోత్సవంగా ప్రకటించింది.ఈ ఏడాది ఇస్రో, భారత ప్రభుత్వం, షార్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా అంతరిక్ష దినోత్సవాలను నెల రోజుల పాటు వివిధ ప్రాంతాల్లో నిర్వహించారు.శుక్రవారం న్యూఢిల్లీలో జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని ఇస్రో ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి పాల్గొంటారు.

షార్ ఎదిగిందిలా....

ఇస్రో విజయాల్లో శ్రీహరికోటలోని షార్‌కు ప్రముఖ పాత్రే వుంది. 1969లో శ్రీహరికోటను రాకెట్ కేంద్రంగా ప్రకటించారు 1971లో రోహిణి -125 సౌండింగ్ రాకెట్ ప్రయోగాత్మక పరీక్షలు జరపడంతో కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. 1969-79 మధ్యలో కాలంలో ఇక్కడ నుంచి ప్రయోగాలు చేసేందుకు అవసరమైన సౌకర్యాలను ఏర్పాటు చేసుకున్నారు.తొలిసారిగా 1979 ఆగస్టు 10న ఎస్ఎల్‌వీ రాకెట్ ప్రయోగం చేపట్టారు. 1987లో ఏఎస్ఎల్వీ, చిన్న ఉపగ్రహాలను పంపారు. 1993 సెప్టెంబరు 20న పీఎస్ఎల్వీ ప్రయోగాలకు ఇస్రో ఇక్కడినుంచే శ్రీకారం చుట్టింది.వరుస విజయాలను అందుకొని చరిత్ర సృష్టించింది. చంద్రయాన్-1 కూడా పీఎస్ఎల్వీ వాహక నౌక ద్వారానే ప్రయోగించడం విశేషం. అధిక బరువు గల ఉపగ్రహాలను పంపేందుకు 2001లో జీఎస్ఎల్వీ రాకెట్ ప్రయోగాలకు శ్రీకారం చుట్టింది. అనంతరం 2014లో జీఎస్ఎల్వీ-మార్క్ 3 ప్రయోగం చేపట్టింది. మళ్లీ ప్రయోగ ఖర్చును తగ్గించేందుకు 2022 ఆగస్టు 7న ఎస్ఎస్ఎల్వీ ప్రయోగాలకు శ్రీకారం చుట్టి వాణిజ్యపరంగా దూసుకెంది. ఇస్రో ఇప్పటికి ఆరు రకాల వాహక నౌకలు రూపొందించి 97 ప్రయోగాలు చేపట్టింది. చిన్న ప్రయోగాల నుంచి చంద్రయాన్-1, మంగళయాన్, ఆదిత్య-ఎల్ 1 వంటి భారీ ప్రయోగాలను విజయవం తంగా చేపట్టింది.చంద్రయాన్-2 చివరి నిమిషంలో విఫలమైనా చంద్రయాన్-3 ప్రయోగం ద్వారా సాఫ్ట్ ల్యాండింగ్ చేయడంలో శాస్త్రవేత్తలు విజయం సాధించారు. భవిష్యత్‌లో గగన్‌యాన్ ద్వారా మానవుడిని అంతరిక్షంలోకి పంపడమే ఇస్రో లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకు సంబంధించిన పలు పరీక్షలను విజయవంతంగా నిర్వహిస్తోంది.

- సూళ్లూరుపేట

వరదయ్యపాళెం ఏఎస్ఐ సస్పెన్షన్

వరదయ్యపాళెం, ఆగస్టు 22: విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఏఎస్ఐ షణ్ముగాన్ని ఎస్పీ సుబ్బరాయుడు బుధవారం సస్పెండ్ చేశారు.వరదయ్యపాళెంలో గత ఆదివారం రాత్రి 10.45గంటలకు ఇందిరానగర్‌కు చెందిన ఇద్దరు యువకులు గొడవ పడ్డారు.వారిలో ఒకరు రాత్రి 11గంటల సమయంలో పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేయడానికి రాగా సెంట్రీ డ్యూటీలో ఉన్న కానిస్టేబుల్ ఈ విషయాన్ని స్టేషన్ ఇన్‌ఛార్జిగా ఉన్న ఏఎస్ఐ షణ్ముగానికి ఫోన్ ద్వారా తెలియజేశాడు. మరుసటి రోజు వచ్చి ఫిర్యాదు చేయాలని చెప్పాడు.సోమవారం సాయంత్రం కేసు నమోదు చేశారు. అయితే కేసు నమోదు విషయంలో షణ్ముగం నిర్లక్ష్యం చూపాడంటూ ఎస్పీ సుబ్బరాయుడికి బాధితులు ఫిర్యాదు చేశారు.ఫిర్యాదు స్వీకరించి విచారణ జరపకుండా నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించాడం, పై అధికారులకు తెలియజేయకుండా బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడమనే కారణాలతో ఏఎస్ఐ షణ్ముగాన్ని ఎస్పీ సుబ్బరాయుడు సస్పెండ్ చేశారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఎవరిపైన అయినా కఠిన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు.

నడిరోడ్డుపై పసికందు





నాయుడుపేట టౌన్/ఓజిలి, ఆగస్టు 22 : ఓజిలి మండలం జోశ్యులవారికండ్రిగ సమీపాన ఉన్న మైలురాయి వద్ద నడిరోడ్డుపై అప్పుడే పుట్టిన పసికందును ఎవరో వదిలేసి వెళ్లిపోయారు. గురువారం బహిర్భూమికి వెళ్లిన సుబ్రహ్మణ్యం అనే వ్యక్తికి పసికందు ఏడుపు వినిపించింది. మైలురాయికి వెనుక వైపు గుడ్డల్లో చుట్టి ఉన్న ఓ పసికందు అతని కంటపడింది. ఆ పసికందును అతను నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తీసుకువెళ్లాడు. బొడ్డుకూడా కొయ్యని ఆ పసికందుకు వారు వైద్యం అందించారు. స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులతోపాటూ ఐసీడీఎస్ సీడీపీవో ఉమామహేశ్వరి ఆస్పత్రికి చేరుకొన్నారు. పసికందు ఆరోగ్యం నిలకడగా ఉండడంతో గురువారం రాత్రి నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలలో ఉంచి శుక్రవారం ఉదయం చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ద్వారా శిశు గృహకు తరలిస్తున్నట్లు సీడీపీవో ఉమామహేశ్వరి తెలిపారు.

రూ.50 లక్షల లిక్విడ్ గంజాయి స్వాధీనం

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 22: తిరుపతిలో పోలీసులు దాదాపు 50 లక్షల విలువ చేసే లిక్విడ్ గంజాయిని గురువారం మధ్యాహ్నం ఓ కారుతో పాటు స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి రూరల్ సీఐ సాదిక్ ఆలి తెలిపిన వివరాల మేరకు.. కేఎల్71-డీ 3686 నెంబరుతో ఉన్న కారులో లిక్విడ్ గంజాయి భారీ ఎత్తున తీసుకెళుతున్నారని పోలీసులకు ముందస్తు సమాచారం అందింది. దీంతో ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాలతో రూరల్ సీఐతోపాటు ఎస్ఐలు షేక్ షావలి, నాగేంద్రబాబు తమ సిబ్బందితో కలసి నాయుడుపేట- పూతలపట్టు జాతీయ రహదారిపై వాహనాలు తనిఖీ చేస్తున్నారు. చిత్తూరు వైపు వెళుతున్న ఈ కారులోని వారు పోలీసులను చూసి పరారవడానికి ప్రయత్నించారు. పోలీసులు వెంబడించడంలో కారును రామానుజపల్లె సర్కిల్ వద్ద వదిలి, అందులోని ముగ్గురు పరారయ్యారు. కారును పరిశీలించగా డిక్కీ, డ్రైవర్ సీటు వెనుక లిక్విడ్ గంజాయి మూటలు బయటపడ్డాయి. వీటి విలువ సుమారుగా రూ.50 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. పరారైన ముగ్గురు నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నారు. ఈ తనిఖీల్లో ఏఎస్ఐ రాఘవ, తదితరులు పాల్గొన్నారు.



లిక్విడ్ గంజాయిని మీడియాకు చూపుతున్న సీఐ సాదిక్ ఆలి

ఇసుక కోసం వినియోగదారులు ఇక పడిగాపులు కాయాల్సిన అవసరం లేదు. ప్రజల ఇబ్బందులను గుర్తించి ప్రభుత్వం కీలకమైన నిర్ణయాలు చేసింది.ఈ వివరాలను కలెక్టర్ వెంకటేశ్వర్ ఎస్పీ సుబ్బరాయుడితో కలిసి గురువారం కలెక్టరేట్‌లో మీడియాకు తెలిపారు. - తిరుపతి(విద్య)



ఇసుక కోసం ఇక పడిగాపులు అక్కర్లేదు

- 10 సచివాలయాల్లో బుక్ చేసుకునే అవకాశం
- వాహనం రకం, రీచ్ నుంచి దూరాన్నిబట్టి రవాణా చార్జీలు

ముందస్తు బుకింగ్ చేసుకోవాలి

ఇసుక కావాల్సినవారు నేరుగా డిపోలకు వచ్చి ఇసుకను తీసుకెళ్లడానికి అవకాశం లేదు. ముందుగానే బుక్‌చేసుకోవాల్సి ఉంటుంది. ఇందు కోసం జిల్లావ్యాప్తంగా 10 సచివాలయాలను అధికారులు గుర్తించారు. వీటిలో తిరుపతి అర్బన్ మధురానగర్2, తిరుపతి రూరల్ మల్లంగుట, పుత్తూరు ఎన్‌జీవో కాలనీ, శ్రీకాళహస్తి ఎంఎం వాడ2, నాగాలాపురం సురుటుపల్లి, సత్యవేడు కలమనాయుడుపేట, పిచ్చాటూరు కీలపూడి, వెంకటగిరి ఎన్ఆర్ కాలనీ, గూడూరు బొగ్గుల దిబ్బ వీధి, సూళ్లూరుపేట నాగరాజపురంలోని సచివాలయాలు ఉన్నాయి. జిల్లాలో ఎవరు ఎక్కడి నుంచైనా ఏ డిపో పరిధిలోనైనా బుక్ చేసుకోవచ్చు. ఇసుక కావాల్సిన వ్యక్తి లేదా అతడి తరపున వేరొకరు కానీ ముందురోజే ఈ సచివాలయాల వద్దకు వచ్చి బుక్ చేసుకోవాలి. ఇలా బుక్ చేసుకున్నాక ఓ టైమ్ స్లాట్ ఇస్తారు. అందులో సూచించిన తేదీ, టైమ్ ప్రకారం ముందుగా నమోదు చేసిన వాహనంతో రీచ్ వద్దకు వచ్చి ఇసుకను తీసుకెళ్లొచ్చు. బుకింగ్‌ని ఒకటి, రెండ్రోజుల్లో అందుబాటులోకి తెస్తామని కలెక్టర్ తెలిపారు.

ప్రభుత్వానికి ఎటువంటి ఆదాయం ఉండదు

ప్రభుత్వం ప్రకటించిన ఉచిత ఇసుక పాలసీ ప్రకారం.. అడవి కోయంబేడులో 2, సుబ్బనాయుడు కండ్రిగ, వెంకటగిరి, సూళ్లురుపేటల్లో ఒకటి చొప్పున మొత్తం ఐదు స్టాక్ పాయింట్లలో లక్షా 90వేల మెట్రిక్ టన్నుల ఇసుక ఉండేదన్నారు. రెండు నెలల్లో లక్షా 16వేల మెట్రిక్ టన్నుల ఇసుకను విక్రయించినట్టు వెల్లడించారు. ఇందులో ప్రభుత్వానికి ఎటువంటి ఆదాయం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు.

లక్ష మెట్రిక్ టన్నుల కొత్త రీచ్ గుర్తింపు

అడవి కోయంబేడులో మాత్రమే 83వేల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉంది. ఈ పాయింటు నుంచి దూరపు ప్రాంతాలవారికి రవాణా ఖర్చు ఎక్కువైపోతోందని మీడియాలో కథనాలు వస్తున్న నేపథ్యంలో నాయుడుపేట కలవకూరు గ్రామం పాలిచర్ల ఆనకట్ట వద్దలో లక్ష మెట్రిక్ టన్నుల ఇసుకను గుర్తించారు. రెండు వారాల్లోగా ఈ రీచ్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ రీచ్ ప్రారంభమైతే శ్రీకాళహస్తి తదితర ప్రాంతాలకు అందుబాటులో ఉంటుంది. రవాణా చార్జీలు తగ్గుతాయని కలెక్టర్ చెప్పారు.

సమస్యలపై 0877-2999077 నెంబరుకు ఫిర్యాదు చేయొచ్చు

కొన్నిచోట్ల అక్రమ శాండ్ మైనింగ్ జరుగుతోందని, ముందు వచ్చిన వారికంటే వెనుక వచ్చినవారికి ఇసుకను ఇస్తున్నారనే విషయాలు మా దృష్టికి వచ్చాయి. అంతేకాకుండా డిపోల్లో అధిక ధరలు తీసుకుంటున్నారని, రోజుల తరబడి పడిగాపులు కాయాల్సి వస్తుందని కూడా తెలిసింది. తాజాగా ప్రభుత్వం తెస్తున్న నూతన విధానం వల్ల ఈ ఇబ్బందులు ఉండవు. అలాగే ఏరకం వాహనం అనేదాన్ని బట్టి కిలోమీటర్ల వారీగా రవాణా చార్జీలు ఉంటాయి. కేవలం బుక్ చేసుకున్న వాహనం మాత్రమే తీసుకురావాలి. ఇతర వాహనాన్ని అనుమతించరు. అలాగే అక్రమ ఇసుక, ఇతర ఇబ్బందులను నిర్మూలించేందుకు జిల్లా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశాం. 0877-2999077 నెంబరుకు కాల్‌చేసి ప్రజలు ఫిర్యాదు చేయొచ్చని సూచించారు. అలాగే 18004256035 టోల్ ఫ్రీ నెంబరుకు ఫోన్ చేసి రాష్ట్ర కంట్రోల్ రూమ్‌కు కూడా ఫిర్యాదు చేయొచ్చని కలెక్టర్ వివరించారు.

సెప్టెంబరులో కొత్త పాలసీ

ప్రస్తుతం అమల్లో ఉన్న ఇసుక పాలసీ సెప్టెంబరు 11వ తేదీవరకు ఉంటుంది. ఆ తర్వాత కొత్తపాలసీని ప్రభుత్వం ప్రకటించే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో.. పట్టా భూముల్లో కూడా ఇసుక మేటలు వేసి ఉందని, ఇలాంటి వాటిపైకూడా పాలసీని ప్రభుత్వ ప్రకటిస్తుందని చెప్పారు.

అక్రమ తవ్వకాలపై కఠిన చర్యలు

ఇసుక అక్రమ తవ్వకాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ సుబ్బరాయుడు హెచ్చరించారు. స్టాక్ పాయింట్ల వద్ద పోలీసులు, ఎక్సైజ్, రెవెన్యూ, ఎస్ఈబీ, మైనింగ్ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తారని, ఎక్కడా అవకతవకలు లేకుండా చర్యలు తీసుకుంటారని చెప్పారు. అక్రమ తవ్వకాలు, ఇతర సమస్యలపై జిల్లా, రాష్ట్ర కంట్రోల్ రూమ్‌లకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

రెండు నెలల్లో 136 కేసులు : రెండు నెలల్లో సెబ్, పోలీసులు అధికారులు ఇసుకకు సంబంధించి జిల్లాలో 136 కేసులు నమోదు చేయగా 191 మందిని అరెస్ట్ చేశారు. 786 టన్నుల ఇసుకను, 179 వాహనాలను సీజ్ చేశారు.

కిలోమీటర్లు, టన్నులను బట్టి ధరలు రూపాయల్లో

నెం	కిలోమీటర్లు	ట్రాక్టర్ 4టన్నులు	6 వీలర్ 10 టన్నులు	10 వీలర్ 18 టన్నులు	12 వీలర్ 23 టన్నులు
1	0-5	800	-	-	-
2	5-10	1000	-	-	-
3	0-10	-	1800	2600	3500
4	11-20	1500	3000	4000	5000
5	21-30	2500	3500	5500	6500
6	31కి.మీపైన ప్రతీ కి.మీకి	-	90	150	175

- *0 నుంచి 10 కిలో మీటర్ల లోపు దూరానికి ఇసుక రవాణా చేసేందుకు కేవలం ట్రాక్టర్లకు, 4 టన్నులలోపు మాత్రమే అనుమతి. 6, 10, 12 వీలర్లకు అనుమతి లేదు.*
- *30 కిలోమీటర్లకు పైబడిన దూరానికి ఇసుక రవాణా చేసేందుకు ట్రాక్టర్లకు అనుమతి లేదు. 30 కిలోమీటర్ల పైబడిన దూరానికి 6, 10, 12 వీలర్ వాహనాల్లోనే 10, 18, 23 టన్నుల వంతున రవాణా చేసుకోవచ్చు.*
- *31 కిలో మీటర్ల దూరం నుంచి ప్రతీ కిలో మీటరుకు 6 వీలర్‌కు రూ. 90, 10 వీలర్‌కు రూ. 150, 12 వీలర్‌కు రూ. 175 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది.*

పాఠశాలలో ప్రమాదం

- పాత ఫర్నిచర్ దగ్ధం, రూ.లక్ష ఆస్తి నష్టం
- విద్యార్థులకు తప్పిన పెను ప్రమాదం



భవనంపై పొగలు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 22: ఓ పాఠశాలలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం జరిగింది. పాత ఫర్నిచర్ దగ్ధమైంది. సకాలంలో అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పేయడంతో విద్యార్థులకు పెను ప్రమాదం తప్పింది. స్థానికులు, అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపిన వివరాల మేరకు.. బైరాగిపట్టెడలోని సోక్రటీస్ పాఠశాలలో గురువారం ఉదయం తరగతులు జరుగుతున్న సమయంలో అకస్మాత్తుగా భవనం నాల్గవ అంతస్తు నుంచి మంటలు ఎగసిపడ్డాయి. ఉపాధ్యాయులు, సిబ్బంది భవనంపైకి వెళ్లి చూడగా.. అక్కడున్న గదిలో వాటర్ సరఫరా కోసం ఏర్పాటు చేసిన మోటారు వైర్లలో షార్టుసర్క్యూట్ జరిగి మంటలు చెలరేగినట్లు గుర్తించారు. అక్కడున్న పాత ఫర్నిచర్, చిత్తు కాగితాలకు మంటలు వ్యాపించాయి. ఈ సమాచారం అందుకున్న అగ్నిమాపక అధికారులు వెంటనే ఫైరింజన్‌తో ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేయడంతో విద్యార్థులకు ప్రమాదం తప్పింది. అప్పటికే విద్యార్థులను పాఠశాల తరగతి గదుల నుంచి బయటకు పంపేశారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులూ పాఠశాల వద్దకు చేరుకున్నారు. పిల్లలు సురక్షితంగా ఉండటంతో ఇళ్లకు తీసుకెళ్లిపోయారు. కాగా, పాఠశాలలో ఫైర్ ఫైటింగ్ పరికరాలు లేకపోవడంపై అగ్నిమాపక సిబ్బంది అసంతృప్తి వ్యక్తం చేశారు.



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.12 కోట్లు

తిరుమల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.12 కోట్లు లభించింది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ బుధవారం లెక్కించి, గురువారం ఉదయం ప్రకటించింది. బుధవారం 74,957 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 33,066 మంది తలనీలాలు సమర్పించారు.

హైదరాబాద్ వచ్చి కలువు

● అభిమానికి చిరంజీవి ఆహ్వానం



ఈశ్వర్‌రాయల్‌తో మాట్లాడుతున్న చిరంజీవి

తన కోసం ఎన్నోసార్లు పొర్లుదండాలతో తిరుమల మెట్లెక్కాడనే విషయం తెలుసుకున్న హీరో చిరంజీవి ఆ అభిమానిని హైదరాబాద్‌కు రావాలని ఆహ్వానించారు. జిల్లాలోని రామచంద్రాపురం మండలం బలిజపల్లికి చెందిన ఈశ్వర్‌రాయల్ మెగా ఫ్యామిలీకి వీరాభిమాని. చిరంజీవి, పవన్‌కల్యాణ్‌లు ఆరోగ్యంగా ఉండాలని, రాజకీయాల్లో ఉన్నతస్థానాలకు వెళ్లాలని ఇప్పటికే 21సార్లు తిరుమల మెట్లెక్కాడు. పుట్టినరోజు సందర్భంగా తిరుమలకు వచ్చిన చిరంజీవి గురువారం వైకుంఠం క్యూకాంప్లెక్స్ వద్ద మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కోసం ఎదురుచూస్తున్న క్రమంలో కొందరు ఈశ్వర్‌రాయల్‌ను చూపించి మీ కోసం పొర్లుదండాలు చేసే వ్యక్తి ఇతడే అని తెలిపారు. దీంతో చిరంజీవి ఈశ్వర్‌రాయల్ దగ్గరకు వచ్చి భుజం మీద చేయి వేసి 'నీ గురించి విన్నానయ్యా.. మీ కుటుంబ సభ్యలను తీసుకుని హైదరాబాద్‌కు రా.. వచ్చి నన్ను కలువు.. అన్ని ఏర్పాట్లు స్వామే చేస్తాడు' అంటూ ఆహ్వానించారు. దీంతో ఎన్నో ఏళ్లుగా తాను అభిమానించే వ్యక్తి నుంచి ఆహ్వానం రావడంతో ఈశ్వర్‌రాయల్ సంబరపడిపోయాడు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

అమ్మవారిని దర్శించుకున్న మంత్రి ఆనం



ఆలయం వద్ద మంత్రి రామనారాయణరెడ్డి

తిరుచానూరు, ఆగస్టు 22: పద్మావతి అమ్మవారిని గురువారం రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి దర్శించుకున్నారు. టీటీడీ ఈవో శ్యామలరావు, జేఈవో వీరబ్రహ్మం, డిప్యూటీ ఈవో గోవిందరాజన్, వేదపండితులు ఆయనకు స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు ఆయనకు వేదాశీర్వచనం చేసి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఘనంగా చిరంజీవి జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న అభిమానులు

చంద్రగిరి, ఆగస్టు 22: చంద్రగిరిలో సినీనటుడు, కేంద్ర మాజీ మంత్రి చిరంజీవి జన్మదిన వేడుకలను అభిమానులు గురువారం ఘనంగా నిర్వహించారు. చిరంజీవి అభిమానులు, చంద్రగిరి నియోజకవర్గ టీడీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు బెల్లంకొండ రమేష్‌రాయల్, రాజారాయల్, నీలాద్రి ఆధ్వర్యంలో టవర్ క్లాక్ వద్ద కేక్ కట్ చేసి, అందరికీ పంచిపెట్టారు. అనంతరం అన్నదానం చేశారు. వారు మాట్లాడుతూ చిరంజీవి సినీరంగంలో తనకంటూ ప్రత్యేకస్థానం సంపాదించి, కోట్లాది మంది అభిమానులను కూడగట్టుకొన్నారని చెప్పారు. ఎన్నో సామాజిక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. బీజేపీ నాయకులు తపస్వీ మురళిరెడ్డి, నవీన్‌కుమార్, పొర్లుదండాల ఈశ్వర్‌రాయల్, మాజీ ఎంపీటీసీ బుజ్జీ, గోపీరాయల్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ టూరిజం టిక్కెట్ల కేసులో విచారణ వేగవంతం



నిందితులను విచారిస్తున్న సీఐ

తిరుమల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): టూరిజం టిక్కెట్ల పేరుతో నకిలీ టిక్కెట్లు సృష్టించి అక్రమాలకు పాల్పడిన కేసు విచారణను పోలీసులు వేగవంతం చేశారు. చెన్నైకి చెందిన ఓ ట్రావెల్స్ సంస్థ నిర్వాహకులతో కుమ్మక్కై నకిలీ టిక్కెట్లను స్కాన్ చేస్తున్నట్టు నటించి భక్తులను అనుమతిస్తున్న అక్రమం ఇటీవల వెలుగు చూసిన విషయం తెలిసిందే. ఈకేసులో కాంట్రాక్ట్ ఉద్యోగి రుద్రసాగర్‌తో పాటు కేవీఎస్ సంస్థలో పనిచేసిన మాజీ ఉద్యోగి నవీన్, ట్రావెల్స్‌కు చెందిన ఓ వ్యక్తితో సహా ముగ్గురిని విజిలెన్స్ ఫిర్యాదు మేరకు పోలీసులు అరెస్ట్ చేశారు. మరో ముగ్గురికోసం గాలిస్తున్నారు. ఈ కేసులో ఎవరెవరు ఉన్నారు, వీరికి టీటీడీ ఉద్యోగులు ఏమైనా సహకరించారా, ఈ అక్రమం ఎప్పటి నుంచి సాగుతోంది, ఎంత అక్రమానికి పాల్పడ్డారనే అంశాలపై తిరుమల టూటౌన్ సీఐ సత్యనారాయణ విచారణ చేస్తున్నారు. కేసుకు సంబంధించి రెండు బృందాలను చెన్నై, బెంగళూరుకు పంపినట్టు సమాచారం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కేసులో ఎంతటి పెద్దవారున్నా అరెస్ట్ చేసే దిశగా పోలీసుల దర్యాప్తు సాగుతోంది.

ఆంగ్ల భాష అధ్యాపక పోస్టుకు దరఖాస్తు చేసుకోండి

ఎర్రావారిపాలెం, ఆగస్టు 22: మండలంలోని నెరబైలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆంగ్ల భాష అధ్యాపక పోస్టుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టరు ఎస్.మురగయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఆంగ్ల భాషను బోధించాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 28వ తేదీన కళాశాలలో జరిగే ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు. పూర్తి వివరాలకు 98850 67858 నెంబరును సంప్రదించాలని కోరారు.

ఘనంగా ప్రపంచ జానపద దినోత్సవం



మాట్లాడుతున్న తాళ్ల రవీంద్రబాబు

పాకాల, ఆగస్టు 22: ప్రపంచ జానపద దినోత్సవాన్ని స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. శ్రీవెంకటేశ్వర జానపద కళారూపాల సేవాసమితి, ఏపీ జానపద కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ బేబీశ్వరరెడ్డి అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ జానపదాలు పల్లెల్లో వరినాట్లు వేసేటప్పుడు కష్టాన్ని మరచిపోవడానికి పాడుకునే పాటలని చెప్పారు. వెంకటేశ్వర జానపద కళాకారుల సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు తాళ్ల రవీంద్రబాబు జానపదాల విశిష్టత గురించి విద్యార్థులకు వివరించారు. బాలికలు, చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అధ్యాపకులు తులసీరామ్‌రెడ్డి, పూర్వ విద్యార్థి వేణుగోపాల్ నాయుడు, ఎస్వీఎన్ పాఠశాల హెచ్‌ఎం మోహన్ తదితరులు పాల్గొన్నారు.



జానపద నృత్యం చేస్తున్న → బాలికలు







పోలీస్‌స్టేషన్‌లో కొట్టుకుంటుండగా అడ్డుకుంటున్న పోలీసులు

పోలీసుల ఎదుటే డిష్యుం.. డిష్యుం

● కొందరికి గాయాలు ● పాత కక్షలతో రెండు కుటుంబాల మధ్య ఘర్షణ

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 22: పోలీసుల ఎదుటే రెండు కుటుంబాలకు చెందిన 15 మంది కొట్టుకున్నారు. కొందరు గాయపడ్డారు. తిరుపతి రూరల్ సర్కిల్ స్టేషన్ వద్ద గురువారం సాయంత్రం ఈ ఘటన జరిగింది. తిరుపతి రూరల్ పరిధిలోని కాలూరుకు చెందిన గోపీ అతడి కుమారుడు వెంకట కిరణ్, పక్కింటిలో కాపురముంటూ గ్యాస్ సరఫరా చేస్తున్న జానకిరాం మధ్య పాత కక్షలున్నాయి. కొద్ది రోజులుగా వీరి మధ్య విభేదాలు తారస్థాయికి చేరాయి. ఈ క్రమంలో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయడానికి వచ్చిన జానకిరాంను మరో వర్గానికి చెందిన వారు స్టేషన్ ఎదుటే దుర్భాషలాడారు. మాటామాటా పెరిగి స్టేషన్ వద్ద ఎస్‌ఐ షేక్ షావలి, సిబ్బంది ఎదుట కొట్టుకోవడం మొదలుపెట్టారు. అక్కడున్న పోలీసులు వారిని వారించే ప్రయత్నం చేసినా పట్టించుకోకుండా మహిళలు, పురుషులూ కొట్లాటకు దిగారు. ఓ మహిళ కిందపడ్డారు. కొందరు గాయపడ్డారు. మహిళలపై ఎస్‌ఐ ఎదుటే దౌర్జన్యానికి దిగిన ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు విచారిస్తున్నామని ఎస్‌ఐ నాగేంద్రబాబు తెలిపారు.

అన్నక్యాంటీన్ల నిర్వహణలో భాగస్వాములవుదాం



ఎంపీ అప్పలనాయుడు - గుమ్మనూరు జయరాం - వసుంధర - బాబు రాజేంద్రప్రసాద్ - బిగ్‌బాస్ దివి

● ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

తిరుమల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): పేదవాడి ఆకలి తీర్చేందుకు సీఎం చంద్రబాబు ఏర్పాటు చేసిన అన్నక్యాంటీన్ల నిర్వహణలో అందరం భాగస్వాములవుదామని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు పిలుపునిచ్చారు. తిరుమల శ్రీవారిని గురువారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలతో పాటు దేశవిదేశాల్లో ఉన్న తెలుగు వారందరూ అన్నక్యాంటీన్ల నిర్వహణకు విరాళాలు ఇవ్వాలని కోరారు.

వైసీపీ ప్రతిపక్షహోదా అడగడం భావ్యం కాదు

వైసీపీ ప్రతిపక్ష హోదా అడగడం భావ్యం కాదని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అన్నారు. శ్రీవారిని దర్శించుకున్న అనంతరం ఆయన మాట్లాడుతూ... ఇప్పుడున్న పరిస్థితుల్లో సరిపడా సభ్యులు లేకపోతే ప్రతిపక్ష హోదా అడిగే అవకాశం లేదని తన, ప్రజల అభిప్రాయమన్నారు. ప్రతిపక్షమే లేకుండా ప్రజలు ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారన్నారు.

పంచాయతీలకు మంచిరోజులు వచ్చాయ్

రాష్ట్రంలోని పంచాయతీలకు మంచి రోజులు వచ్చాయని, పాత స్వర్ణయుగం రాబోతోందని, సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో గ్రామాలు అభివృద్ధి చెందుతాయని భావిస్తున్నామని రాష్ట్ర పంచాయతీ రాజ్ ఛాంబర్ అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ అన్నారు. శ్రీవారిని దర్శించుకున్న అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 13 వేల గ్రామ పంచాయతీలకు, 150 మున్సిపాలిటీలకు సీఎం,డిప్యూటీ సీఎం రూ. 1500 కోట్లు కేటాయించారన్నారు. ఇందుకు గాను వారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు చెప్పారు.

శ్రీవారిసేవలో బాలయ్య సతీమణి

ప్రముఖ సినీహీరో, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సతీమణి వసుంధర గురువారం వేకువజామున ఆలయంలో జరిగిన తోమాలసేవలో పాల్గొని శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆమెకు ఆలయ అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు. అదేవిధంగా బిగ్‌బాస్-4 బ్యూటీ, లంబసింగి చిత్ర హీరోయిన్ దివి కూడా స్వామి వారిని దర్శించుకున్నారు.

ఎర్రచందనం స్వాధీనం

● ఓ స్మగ్లర్ అరెస్టు

మంగళం, ఆగస్టు 22: సానిపాయ అటవీ ప్రాంతంలో గురువారం టాస్క్‌ఫోర్సు పోలీసులు కూంబింగ్ నిర్వహించి 13 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని ఒక స్మగ్లర్‌ను అరెస్టు చేశారు. అలాగే మోటారు సైకిల్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్సు ఇన్‌చార్జి, జిల్లా ఎస్పీ సుబ్బరాయుడి ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ నేతృత్వంలో సానిపాయ బేస్ క్యాంపు నుంచి ఆర్‌ఎస్ఐ మురళీధర్‌రెడ్డి బుధవారం కూంబింగ్ చేపట్టారు. రెండు బృందాలు ఎద్దులకోన రాస్తా మీదుగా కొండూరు గ్రామానికి చేరుకుని, చిట్వేల్ రేంజి పెంగలూరు మండలం అటవీ ప్రాంతంలోకి చేరుకున్నారు. ఈ క్రమంలో గురువారం తెల్లవారుజామున చక్రంపేట వద్ద ముగ్గురు వ్యక్తులు మోటారుసైకిల్‌పై వెళుతుండగా టాస్క్‌ఫోర్సు పోలీసులు వీరిని చుట్టుముట్టే సరికి ఇద్దరు తప్పించుకుని పారిపోగా, ఒకరిని పట్టుకోగలిగారు. కోడూరు టౌన్ పగడాలపల్లికి చెందిన తుపాకుల హరినాథ్(37)గా గుర్తించారు. ఇతడిని విచారించగా దాచిన 13 ఎర్రచందనం దుంగలను చూపించాడు. వాటితో పాటు మోటారుసైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీసుస్టేషన్‌కు తరలించి సీఐ సురేష్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పట్టుబడ్డ ఎర్రచందనంతో టాస్క్‌ఫోర్సు పోలీసులు



నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు

హత్యాచారంపై నిరసన

చంద్రగిరి, ఆగస్టు 22: కోల్‌కతాలో జూడాపై జరిగిన హత్యాచార ఘటనకు నిరసనగా గురువారం మండలంలోని తొండవాడ సమీపంలోని శ్లోకా బిర్లా స్కూల్ విద్యార్థులు ప్లకార్డులు చేతపట్టుకుని చంద్రగిరిలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం టవర్‌క్లాక్ వద్ద సాంఘిక నృత్య ప్రదర్శనలు చేసి, ప్రజలను చైతన్యపరిచారు. హెచ్‌ఎం వీణావాణి మాట్లాడుతూ వైద్య విద్యార్థిని ఘటన యువతుల్లో, మహిళల్లో భయాందోళనకు గురిచేస్తుందని, మహిళలకు రక్షణకల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని చెప్పారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠినచర్యలు తీసుకోవాలన్నారు. స్కూల్ డైరెక్టర్ శ్రీవత్సవ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫోన్ మాత్రమే డిపాజిట్‌గా తీసుకుంటున్నాం

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

తిరుపతి(వైద్యం), ఆగస్టు 22: సిబ్బంది అందుబాటులో లేనప్పుడు రోగులు వారి సహాయకులను వార్డులకు తీసుకెళ్లాలంటే స్ట్రెచర్, వీల్‌చైర్లు ఇచ్చేందుకు కేవలం సెల్‌ఫోన్ మాత్రమే డిపాజిట్‌గా తీసుకుంటున్నామని, నగదు తీసుకోవడం లేదని రుయాస్పత్రి సూపరింటెండెంట్ రవిప్రభు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఆంధ్రజ్యోతిలో రోగుల సహాయకులకు తప్పని తిప్పలు శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన సూపరింటెండెంట్ 86మంది ఎంఎన్‌వో, ఎఫ్‌ఎన్‌వోలకు గాను కేవలం 72 మంది మాత్రమే ఉన్నారని, ఇంకా 75 మంది అవసరమవుతారని డీఎంఈకి కూడా లేఖ రాసినట్లు పేర్కొన్నారు. తగినంత సిబ్బంది లేకపోవడం వలన ఉన్న వారినే సర్దుబాటు చేస్తున్నామని, దీంతో ఇటువంటి సమస్యలు ఎదురవుతున్నాయని ఆయన తెలిపారు. రోగులను సిబ్బంది ఎవరైనా నగదు అడిగితే నేరుగా వచ్చి తమకు ఫిర్యాదు చేస్తే.. సిబ్బందిపై తక్షణమే చర్యలు తీసుకుంటామన్నారు. ఇదిలా ఉంటే స్ట్రెచర్, వీల్‌చైర్లు రోగులకు ఇచ్చేందుకు వారి నుంచి కేవలం సెల్‌ఫోన్‌ను మాత్రమే డిపాజిట్‌గా తీసుకుంటున్నామని.. నగదు తీసుకోవడం లేదని సూపరింటెండెంట్ లిఖిత పూర్వకంగా వివరణ ఇవ్వడం విమర్శలకు తావిస్తుంది. సెల్‌ఫోన్లు డిపాజిట్‌గా సిబ్బందికి ఇవ్వడం వలన రోగి ఆరోగ్య పరిస్థితిని కుటుంబసభ్యులకు చెప్పేందుకు అవకాశం లేక, అందులో ఉన్న కొన్ని రిపోర్టులను సకాలంలో డాక్టర్లకు చూపించలేక ఇబ్బందులు పడాల్సి వస్తుందని రోగుల సహాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విధానాన్ని పూర్తిగా అరికట్టాలని వారు కోరుతున్నారు.



కేంద్రమంత్రి గిరిరాజ్‌సింగ్‌తో కలసి జ్యోతిని వెలిగిస్తున్న ఎన్‌ఎస్‌యూ వీసీ

సంస్కృతభాషాభివృద్ధికి కృషి

● ఉత్కర్ష మహోత్సవంలో ఎన్‌ఎస్‌యూ వీసీ

తిరుపతి రూరల్, ఆగస్టు22: సంస్కృత భాషాభివృద్ధికి తిరుపతిలోని జాతీయ సంస్కృత వర్సిటీ ఎంతగానో కృషి చేస్తోందని వీసీ జీఎస్‌ఆర్ కృష్ణమూర్తి పేర్కొన్నారు. న్యూఢిల్లీలోని లాల్‌బహదూర్ శాస్త్రి జాతీయ సంస్కృతవర్సిటీలో నిర్వహించిన ఉత్కర్ష మహోత్సవానికి గురువారం ఆయన హాజరై సంస్కృతాన్ని జనబాహుళ్యంలోకి తీసుకెళ్లేందుకు వర్సిటీలో చేపడుతున్న పలు కార్యక్రమాలను వివరించారని తెలిపారు. ఈకార్యక్రమానికి కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్, పద్మశ్రీ అవార్డు గ్రహీత కృష్ణశాస్త్రి హాజరైనట్లు చెప్పారు.

వైసీపీ నేత భూ అక్రమాలపై పరిశీలన

● బాధిత ఎస్టీలకు న్యాయం చేస్తానని తహసీల్దార్ హామీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఏర్పేడు, ఆగస్టు 22: మునలిపేడుకు చెందిన నలుగురు ఎస్టీల భూముల్ని రికార్డుల్లో మార్చి వైసీపీ నాయకులు హస్తగతం చేసుకున్న వైనంపై తహసీల్దార్ భార్గవి స్పందించారు. శ్రీకాళహస్తి మండల వైసీపీ ముఖ్యనేత తన బంధువుల పేరిట వెబ్‌ల్యాండ్‌లో మార్చేసి అక్రమంగా పట్టాలు సృష్టించుకున్నారని ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. గురువారం తహసీల్దారు సిబ్బందితో కలిసి గురువారం మునలిపేడు వెళ్లి ఎస్టీల భూములను పరిశీలించారు. 30 ఏళ్ల నాటి పట్టా, పాసుపుస్తకాలను పరిశీలించారు. వెబ్‌ల్యాండ్‌లో ఎస్టీల భూములను తమ పేరిట మార్చుకున్నారనే ఆరోపణలపై పుట్టారెడ్డిని పిలిపించారు. రికార్డులను చూపాలని ప్రశ్నించారు. ఆయన అధికారులకు పొంతన లేని సమాధానం చెప్పారు. బ్యాంకులో పెట్టి రుణం పొందామని, పదిరోజుల్లో ఆధారాలను చూపిస్తామన్నారు. 30 ఏళ్ల నుంచి ఎస్టీలు సాగు చేసుకుంటున్న భూములను ఎలా మార్చుకుంటారని తహసీల్దారు ప్రశ్నించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఈ ఏడాది జనవరిలో ఆన్‌లైన్‌లో భూములను మార్చారన్నారు. ఇది చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. పూర్తిస్థాయిలో విచారించి బాధిత ఎస్టీ రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కాగా బాధితులకు న్యాయం జరిగే వరకు నిరసన చేపడతామని సీపీఐ ఏరియా కార్యదర్శి జనమాల గురవయ్య ఒక ప్రకటనలో హెచ్చరించారు.



బాధిత రైతులతో మాట్లాడుతున్న భార్గవి



ఉభయ దేవేరులతో తిరుచ్చిపై ఊరేగుతున్న సుందరరాజస్వామి

సుందరరాజస్వామికి వైభవంగా తిరుచ్చి ఉత్సవం

తిరుచానూరు, ఆగస్టు 22: తిరుచానూరులో కొలువై ఉన్న సుందరరాజస్వామికి గురువారం రాత్రి వైభవంగా తిరుచ్చి ఉత్సవం జరిగింది. స్వామివారి జన్మనక్షత్రం ఉత్తరాభాద్రను పురస్కరించుకుని ఆలయంలో ఉత్సవర్లకు నేత్రపర్వంగా అభిషేకం నిర్వహించారు. సాయంత్రం సర్వాలంకార శోభితులైన శ్రీదేవి, భూదేవి సమేత సుందరరాజస్వామి బంగారు తిరుచ్చిపై కొలువుదీరి తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు సాక్షాత్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో రమేష్, ఏవీఎస్‌వో సతీష్‌కుమార్, శేషగిరి, మధు, గణేష్, సుభాస్కర్ నాయుడు, ప్రసాద్ పాల్గొన్నారు.

బెల్ట్‌షాప్‌పై దాడి

పాకాల, ఆగస్టు 22: మండలంలోని దామలచెరువులో నిర్వహిస్తున్న బెల్టుషాపుపై గురువారం పాకాల పోలీసులు దాడిచేశారు. దుద్దు పురుషోత్తం గుప్త ఇంటిలో 27 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన కలుపుమొక్క అవగాహన వారోత్సవాలు



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, ఉద్యోగులు

తిరుపతి రూరల్, ఆగస్టు 22: తిరుపతిలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, పాలిటెక్నిక్ కళాశాలలో వారం రోజుల పాటు నిర్వహించిన కలుపుమొక్క (పార్థీనియం) నివారణ అవగాహనా వారోత్సవాలు గురువారంతో ముగిశాయి. విద్యార్థులు, శాస్త్రవేత్తలు, ఉద్యోగులు కలసి పార్థీనియం కలుపుమొక్క వల్ల కలిగే నష్టాలు, నివారణ చర్యలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. దీనిలో భాగంగా పరిసరాల్లో ఉన్న కలుపుమొక్కలను తొలగించి కాల్చేశారు. ఏడీఆర్ డాక్టర్ వి.సుమతి మాట్లాడుతూ.. ఈమొక్క వల్ల మనుషులకు చర్మ, ఊపిరితిత్తుల వ్యాధులు వస్తాయని, జీవ నియంత్రణ పద్ధతి ద్వారా నివారించవచ్చని తెలిపారు. శాస్త్రవేత్తలు సుధాకర్, ప్రసాద్, లత, విశ్వనాథ్, పాలిటెక్నిక్ సిబ్బంది సహజ, మదన్‌మోహన్, హారతి తదితరులు పాల్గొన్నారు.

ఆర్యావర్క్‌పై ఉచిత శిక్షణ



మహిళలకు శిక్షణ మెటీరియల్‌ను అందజేస్తున్న రాస్ డైరెక్టర్ వి.నాగరాజు

తిరుపతి (ఆటోనగర్), ఆగస్టు 22: మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ఆర్యావర్క్ ఉపకరిస్తుందని, ఇందుకోసమే రాస్ - జనశిక్షణ సంస్థాన్‌లు ఉచిత శిక్షణ ఇస్తున్నాయని రాస్ మహిళా పొదుపు సంఘాల డైరెక్టర్ వి.నాగరాజు అన్నారు. గురువారం జీవకోనలో రాస్ మహిళలకు ఆర్యావర్క్స్‌పై మూడు నెలలపాటు ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్యావర్క్‌కు మంచి డిమాండ్ ఉందని, దీనిపై శిక్షణ ఇస్తే మహిళల ఆర్థిక పరిస్థితులు మెరుగుపడతాయని చెప్పారు. అనంతరం మహిళలకు ఆర్యావర్క్ మెటీరియల్‌ను ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ సుధాకర్‌రెడ్డి, నాగేశ్వరరావు, శ్రీదేవి, రేవతి, మాధవి, 50మంది మహిళలు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో ఆత్మహత్య



పోలినాయుడి మృతదేహం

చంద్రగిరి, ఆగస్టు 22: చంద్రగిరి మండలం, ఐతేపల్లె గ్రామానికి చెందిన పోలి నాయుడు(35) తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు తమిళనాడు రాష్ట్రం, కడలూరు జిల్లాకు చెందిన పోలి నాయుడు, ఆయన భార్య భువనేశ్వరి, ఇద్దరు పిల్లలతో ఐతేపల్లెలో కాపురం ఉంటూ కూలి పనులు చేసుకొంటూ జీవనం సాగిస్తున్నారు. కుటుంబ కలహాల కారణంగా గురువారం తన ఇంట్లో పోలి నాయుడు ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న చంద్రగిరి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాజీ ఎమ్మెల్యే బలవంతంతోనే సంతకాలు

మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఫోన్ చేసి భయపెట్టడం వల్లే ఎస్టీల భూముల మార్పు ఫైల్‌లో సంతకాలు పెట్టాల్సి వచ్చిందని ఓ వీఆర్వో చెప్పారు. భూములను తమ పేరిట మార్చాలని శ్రీకాళహస్తి మండలానికి చెందిన వైసీపీ నేత, వారి బంధువులు ఈ ఏడాది జనవరి 9న ఫైల్‌ను తన వద్దకు తెస్తే కాదన్నానన్నారు. తహసీల్దారు సంతకాలు పెట్టమని చెప్పినా నిరాకరించానన్నారు. అప్పటి ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ఫోన్ చేసి బెదిరించడంతో తప్పనిసరి పరిస్థితిలో భూముల మార్పు ఫైలు మీద సంతకం చేశానన్నారు. ఇందుకు తాను ఒక్క పైసా కూడా తీసుకోలేదని స్పష్టం చేశారు.

టోల్ ఫ్రీ నెంబర్లపై అవగాహన



కార్యక్రమంలో పాల్గొన్న పోలీసు, వర్సిటీ అధికారులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 22: మహిళల రక్షణకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్లను సద్వినియోగం చేసుకోవాలని పోలీసు, పద్మావతి వర్సిటీ అధికారులు కోరారు. ఇంజనీరింగ్ కాలేజీలో టోల్ ఫ్రీ నెంబర్ల (100, 104, 108, 181, 112, 101, 1098, 139, 1930)పై వే ఫౌండేషన్ - ఎన్‌ఎస్‌ఎస్ సంయుక్తంగా గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించాయి. ఆర్పీఎఫ్ సీఐ మధుసూదన్, ఫైర్ శాఖకు చెందిన శంకర్‌రెడ్డి, రుయా డాక్టర్ మానస, సైకియాట్రి డాక్టర్ కిషోర్, సైబర్‌క్రైం కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ, వే ఫౌండేషన్ ఛైర్మన్ పైడి అంకయ్య, ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు విద్యావతి, యువశ్రీ, మాధురి తదితరులు ప్రసంగించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పీఆర్సీ సమస్యను పరిష్కరించడం అభినందనీయం



రాఘవరెడ్డిని సత్కరిస్తున్న నాయకులు

తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు 22: విద్యుత్ శాఖలో 2022 పీఆర్సీ సమస్య పరిష్కారంలో ఏపీ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (327) రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఎంవీ రాఘవరెడ్డి చేసిన కృషి విజయవంతమైందని ఆ యూనియన్ నాయకుడు మురళీధర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాల అంగీకారంలో భాగంగా మాస్టర్ స్కేల్ రూ.2లక్షల 60వేలుగా నిర్ణయించడం జరిగిందన్నారు. ఇంక్రిమెంట్ మాత్రం మాస్టర్ స్కేల్‌కు అనుగుణంగా కాకుండా క్యాడర్ స్కేల్‌కి అనుగుణంగా ఇస్తున్నారని చెప్పారు. ఇలా చేయడం వల్ల సీనియర్ ఉద్యోగులకు అన్యాయం జరుగుతుందన్న విషయాన్ని తమ నాయకుడు గుర్తించి మంత్రితో చర్చలు జరిపారన్నారు. చర్చల అనంతరం సమస్యను పరిష్కరిస్తామని మంత్రి ఉత్తర్వులు జారీ చేయడం అభినందనీయమన్నారు.

సంకటహర చతుర్దశి వేడుకలు

తిరుపతి (జీవకోన), ఆగస్టు 22: వినాయకసాగర్‌లో ఉన్న వినాయక స్వామి ఆలయంలో సంకటహర చతుర్థి సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు గుండాల గోపీనాథ్‌రెడ్డి, సురేష్‌స్వామి, ధర్మకర్త చెంగారెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ఆనంద్, వాసు, పాపిరెడ్డి, కృష్ణయ్య, నాదమునిరెడ్డి, విజయలక్ష్మి, శాంతి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నివాసంలో చిరంజీవి జన్మదిన వేడుకలు



తిరుపతి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు నివాసంలో పద్మభూషణ్ డాక్టర్ చిరంజీవి జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. తన నివాసానికి వచ్చిన చిరంజీవి దంపతులకు ఎమ్మెల్యే ఘనస్వాగతం పలికారు. చిరంజీవి కేక్ కట్ చేసి తన సతీమణి సురేఖతోపాటు ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకు తినిపించారు. తేనీటి విందు స్వీకరించాక హైదరాబాదు బయల్దేరి వెళ్లారు.



తిరుమలలో చిరంజీవికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్న టీడీపీ సీనియర్ నాయకుడు ఊకా విజయకుమార్

పలు ప్రాంతాల్లో అన్నదానం





అన్నదానం చేస్తున్న మదన్‌మోహన్, రాజారెడ్డి - రాములవారి ఆలయం వద్ద అన్నదానం చేస్తున్న చిరు అభిమానులు

తిరుపతి అర్బన్: పాత మున్సిపల్ కార్యాలయం కూడలి వద్ద ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆధ్వర్యంలో జనసేన పట్టణాధ్యక్షుడు రాజారెడ్డి సమక్షంలో భారీ కేక్‌కట్‌చేసి చిరంజీవి అభిమానులకు పంచిపెట్టారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. ఎమ్మెల్యే తనయుడు ఆరణి మదన్‌మోహన్, పొలకల మల్లికార్జున్, మాధవరావు, ఆకేపాటి సుభాషిణి, కీర్తన, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. ● రాములవారి ఆలయం దక్షిణమాడవీధిలో మధ్యాహ్నం దాదాపు 500మందికి అన్నదానం చేశారు. అలాగే ఉదయం పద్మావతిపురంలోని పాస్‌మనోవిహాస్ కేంద్రంలోని పిల్లలకు అల్పాహారం వితరణ చేశారు. 36వ డివిజన్ జనసేన అధ్యక్షులు వినోద్‌రాయల్, సోము, బుజ్జి, లోక, సురేష్, శేషాద్రి, నారాయణ, చంద్రారెడ్డి, భరత్, చంద్ర, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



సంబరాలు చేసుకుంటున్న కిరణ్‌రాయల్ బృందం

గ్రూప్ థియేటర్ వద్ద రుద్రకిషోర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జనసేన తిరుపతి ఇన్‌చార్జి కిరణ్‌రాయల్ పాల్గొన్నారు. కేక్‌కట్‌చేసి పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు. సుమన్, బాబు, హిమవంత్, ఆది, సుమంత్, తదితరులు పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరం



సర్టిఫికెట్లతో రక్తదాతలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు): ఎస్వీయూలో చిరంజీవి ఫ్యాన్స్ నిర్వహించిన మెగా రక్తదాన శిబిరంలో 20 మంది రక్తదానం చేశారు. ఏడీ బిల్డింగ్ వద్ద నిర్వహించిన ఈ శిబిరంలో దాతలకు ప్రిన్సిపాల్ పద్మనాభం సర్టిఫికెట్లు అందజేశారు. మెగా ఫ్యాన్స్ వెంకటేష్, రమేష్, హష్వంత్ పాల్గొన్నారు.

రేపు ఇన్ఫోటెక్ ఆధ్వర్యంలో జాబ్ మేళా

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 22: ఇన్ఫోటెక్ అండ్ సదరలాండ్ గ్లోబల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ శనివారం ఎస్వీయూలో జాబ్ మేళా నిర్వహించనుంది. ఉదయం తొమ్మిది గంటలకు దూరవిద్యా భవనంలో ఈ మేళా ప్రారంభం కానుంది. ఏదేని డిగ్రీ, ఇంజనీరింగ్ అర్హత గల వారు అర్హులు. ఎంపికైన వారికి వార్షిక వేతనం రూ.3లక్షల వరకూ ఉండొచ్చు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లపై కంపెనీ ప్రతినిధులతో వర్సిటీ రిజిస్ట్రార్ మాదాల భూపతి నాయుడు గురువారం సమీక్షించారు. మొదటి దశలో యూనివర్సిటీకి చెందిన 22 మంది విద్యార్థులు ఎంపికయ్యారని ఈ సందర్భంగా రిజిస్ట్రార్ వెల్లడించారు. రెండో దశలో మరింత మందికి అవకాశం కల్పించేందుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేష్ ఆలోచనల మేరకు యువతకు ఉపాధి కల్పించేందుకు ప్రయత్నిస్తున్నామని వివరించారు. సమగ్ర సమాచారం కోసం.. సత్వా ఇన్ఫోటెక్.. వెబ్ సైట్ చూడాలని సూచించారు.

వైవీబీకి సన్మానం



తిరుపతి అర్బన్, ఆగస్టు 22: పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్‌ను గురువారం పద్మావతి గెస్ట్‌హౌస్‌లో తిరుపతి ప్రైవేట్ ట్రావెల్స్ అసోసియేషన్ సన్మానించింది. ట్రావెల్స్ అసోసియేషన్ కన్వీనర్ బొడుగు మునిరాజయాదవ్, అధ్యక్షుడు శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు రూపేష్, పంచాయతీరాజ్ చాంబర్ ఉమ్మడి చిత్తూరుజిల్లా అధ్యక్షుడు చుక్కా ధనంజయయాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగం చెట్టి సుబ్బరామయ్య, సర్పంచుల సంఘం అధ్యక్షుడు కుప్పాలమురళి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీరు ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్త్రీలపై అఘాయిత్యాలు అమానుషం



రుయా వద్ద జూనియర్ డాక్టర్లతో మాట్లాడుతున్న సభ్యులు

తిరుపతి(వైద్యం), ఆగస్టు 22: స్త్రీలపై అఘాయిత్యాలు అమానుషమని ఇస్కాన్ యూత్ ఫోరం సభ్యులు ఫణిగోపాల్, భానుప్రకాష్ అన్నారు. కోల్‌కతాలోని ఆర్జీ కర్ వైద్య కళాశాలలో జూనియర్ డాక్టరుపై జరిగిన హత్యాచారాన్ని వ్యతిరేకిస్తూ రుయాలో జూనియర్ డాక్టర్లు (జూడాలు) నిరసన చేపట్టిన విషయం తెలిసిందే. గురువారం జరిగిన జూడాల నిరసనకు ఇస్కాన్ యూత్ ఫోరం సంఘీభావం తెలిపింది. కౌరవ సభలో మహిళను అవమాన పరిచినందుకే కురుక్షేత్రం జరిగి అందుకు ప్రత్యక్షంగా, పరోక్షంగా బాధ్యులైన లక్షల మంది ప్రాణాలు పోగొట్టుకున్న చరిత్ర మనదన్నారు. ఇప్పుడు మహిళలపై ఇంత దారుణమైన ఘటనలు జరగడం చూస్తుంటే కురుక్షేత్రం కంటే పెద్ద ప్రమాదమే వాటిల్లనుందనేది ప్రతి ఒక్కరూ గ్రహించాలన్నారు. ఇకనైనా మహిళలపై దాడులను అరికట్టి, వారిని రక్షించుకునే ప్రయత్నం చేయాల్సిన అవసరం ఉందన్నారు. లేకపోతే సృష్టి వినాశనం తప్పదని హెచ్చరించారు. ● స్విమ్స్ వద్ద నిర్వహిస్తున్న శిబిరంలో గురువారం కూడా జూడాలు ఓపీ సేవలను కొనసాగించారు.

ఎస్వీయూలో అధ్యాపకులు, విద్యార్థుల నిరసన



తిరుపతి (విశ్వవిద్యాలయాలు): కోల్‌కతాలో డాక్టర్‌పై హత్యాచారం అమానవీయమైనదని ఎస్వీయూలో అధ్యాపకులు, విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉమెన్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో గురువారం నిరసన - నివాళి కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ పద్మనాభం, డీన్ మురళీధర్, వైస్ ప్రిన్సిపాల్ శ్యాండేవిడ్‌రాజు, అధ్యాపకులు రమణ, రాజేశ్వరి, కిషోరి, సునీత, ఈశ్వరి ప్రసంగించారు. మహిళల రక్షణకు పటిష్ఠ చట్టాలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

రేపు హత్యాచారాలపై సదస్సు

మహిళలపై సాగుతున్న హత్యాచారాలపై శనివారం సదస్సు నిర్వహించనున్నారు. పౌర చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు ఆర్ట్స్ బ్లాక్‌లో ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. ఇందులో సీనియర్ జర్నలిస్టు రాఘవ, ఓఆర్ఐ డైరెక్టర్ పీసీ వెంకటేశ్వర్లు ప్రసంగిస్తారు. ఈ మేరకు వేదిక అధ్యక్ష, కార్యదర్శులు వాకా ప్రసాద్, పరమేశ్వరరావు తెలిపారు.

జీవకోనలో ర్యాలీ నిర్వహించిన ముస్లింలు



తిరుపతి (జీవకోన): కోల్‌కతా ఘటనను నిరసిస్తూ గురువారం జీవకోనలో మజీద్ ఏ మహమ్మదీయ ట్రస్టు ఆధ్వర్యంలో ముస్లింలు శాంతియుతంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా 48వ డివిజన్ కార్పొరేటర్ అన్నా అనిత, మజీద్ ఏ మహ్మదీయ ముతవల్లి రఫీ హిందుస్తానీ, ట్రస్టు చైర్మన్ అయిషా పర్వీన్ మాట్లాడుతూ.. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. జీవకోన ఆలయం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ సాగింది. సుమయ్య, వఫా, ఫాతిమా, చాంద్‌బాషా, ఖాదర్, రెడ్డి బాషా, ఖదీర్, షంషేర్, రహంతుల్లా, సదాఫ్, జేబీ షాజహాన్, సొబ్హాన్ తదితరులు పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో ర్యాలీ



తెలుగు మహిళలు గోవింద నగర్ నుంచి లీలామహల్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అక్కడునర్న శ్రీకృష్ణ దేవరాయల విగ్రహం వద్ద నిరసన తెలిపారు. యశోదరెడ్డి, శోభ, నాగేశ్వరి, కళ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్పీ బాధ్యతల స్వీకరణ



ఎస్పీని కలిసిన ఏఎస్పీ నాగభూషణ రావు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 22: తిరుపతి శాంతి భద్రతల అదనపు ఎస్పీగా నాగభూషణ రావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయనకు గతంలో ఎస్‌గా, సీఐగా చిత్తూరు జిల్లాలో చాలాకాలంపాటు పనిచేసిన అనుభవం ఉంది. ప్రస్తుతం పుట్టపర్తి సెబ్‌లో పనిచేస్తూ బదిలీపై తిరుపతి ఏఎస్పీగా నియమితులయ్యారు. ఎస్పీ ఆదేశాలతో శాంతి భద్రతలు విషయంలో రాజీ లేకుండా పనిచేస్తానని నూతన ఏఎస్పీ తెలిపారు. అనంతరం ఎస్పీ సుబ్బరాయుడిని మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు.

ట్రాఫిక్ సీఐగా సంజయ్‌కుమార్

తిరుపతి ట్రాఫిక్ సీఐగా సంజయ్‌కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన అనంతపురం దిశ స్టేషన్‌లో పనిచేసి.. బదిలీపై వచ్చారు.

తిరుమల ఇన్‌చార్జి ఏఎస్పీగా వెంకట్రావు

తిరుమల ఇన్‌చార్జి అదనపు ఎస్పీగా ప్రస్తుతం తిరుపతి ఎస్పీ కార్యాలయంలో అడ్మిన్ అదనపు ఎస్పీగా పనిచేస్తున్న వెంకట్రావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అక్కడ ఇప్పటి వరకు పనిచేసిన విమలకుమారి రిలీవ్ కావడంతో తాత్కాలికంగా వెంకట్రావును నియమించారు. ఈమెతోపాటు తిరుపతి శాంతిభద్రతల విభాగం అదనపు ఎస్పీ కులశేఖర్ కూడా గురువారం రిలీవ్ అయ్యారు.

అదనపు ఎస్పీలకు వీడ్కోలు





కులశేఖర్, విమలకుమారిలను సన్మానిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 22: అదనపు ఎస్పీలుగా పనిచేస్తూ బదిలీ అయిన కులశేఖర్, విమలకుమారిలకు గురువారం పోలీసు అతిథి గృహంలో జరిగిన కార్యక్రమంలో ఘనంగా వీడ్కోలు పలకారు. ఎస్పీ సుబ్బరాయుడు మాట్లాడుతూ.. వీరిద్దరూ తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారని ప్రశంసించారు. అదనపు ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

రాత్రివేళల్లో అల్లరి మూకలపై నిఘా పెట్టండి

అలిపిరి సీఐకి టీఎన్ఎస్ఎఫ్ వినతి



తిరుపతి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): అలిపిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో రాత్రివేళల్లో అల్లరి మూకల సంచారం ఎక్కువగా ఉంటుందని, నిఘా భద్రతా చర్యలు పటిష్ఠం చేయాలని అలిపిరి సీఐ రామ్ కిషోర్‌ను టీఎన్ఎస్ఎఫ్ తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు కొట్టే హేమంత్ రాయల్ కోరారు. నూతన సీఐగా బాధ్యతలు తీసుకున్న ఆయన్ను టీఎన్ఎస్ఎఫ్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. అలిపిరి పరిధిలో గంజాయి, బైక్ రేస్‌లను అరికట్టాలన్నారు. రాత్రివేళల్లో యాత్రికులనుంచి తినుబండారాలపై అధిక ధరలు వసూలు చేస్తున్నారని వినతిలో పేర్కొన్నారు. సీఐని కలిసినవారిలో వెంకటేష్ యాదవ్, జానకి రామ్, జ్ఞానేశ్వర్ రెడ్డి ఉన్నారు.

విద్యుత్ అంతరాయాలను నివారించాలి: ఎస్ఈ



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఈఈలు వాసుదేవరెడ్డి, వాసురెడ్డి తదితరులు

తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు 22: తిరుపతి సర్కిల్ (ఉమ్మడి చిత్తూరు జిల్లా)లో విద్యుత్ సరఫరాలో అంతరాయాలను నివారించాలని ఎస్ఈ సురేంద్రనాయుడు సూచించారు. గురువారం తిరుపతిలోని ఎస్ఈ కార్యాలయం నుంచి అన్ని డివిజన్ల కార్యాలయాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. డీటీఆర్ వైఫల్యాలపై క్షేత్ర స్థాయిలో ఫీడర్స్ పరిధిలో క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. సరఫరా సమయాల్లో నిర్లక్ష్యానికి కోట్ల విలువ చేసే ట్రాన్స్‌ఫార్మర్లు విఫలమవుతున్నాయని చెప్పారు. దీనివల్ల సంస్థకు కోట్ల రూపాయలు నష్ట వాటిల్లుతుందన్నారు. ప్రతి సెక్షన్‌లోనూ అధికారులు ప్రత్యేక నిఘా ఉంచి, చెట్టుకొమ్మలను తొలగించి నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఈఈ టెక్నికల్ శ్రీనివాసులు రెడ్డి, డీఈఈ ప్రసన్న లక్ష్మి, తిరుపతి టౌన్, రూరల్ డివిజన్ల ఈఈలు కె.వాసుదేవరెడ్డి, ఎస్.వాసురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో రాజస్థాన్ వాసి దుర్మరణం

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 22: తిరుపతి రూరల్ పరిధిలోని బాలాజీ డెయిరీ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రాజస్థాన్ వాసి సునీల్ దుర్మరణం చెందాడు. ఆయన భార్య స్వల్పంగా గాయపడ్డారు. రూరల్ ఎస్ఐ నాగేంద్రబాబు తెలిపిన వివరాల మేరకు.. సునీల్ దంపతులు తిరుచానూరు, గోవిందరాజస్వామి ఆలయాల వద్ద దేవుడి బొమ్మలు, ఇతరత్రా వస్తువులు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. గురువారం ఉదయం తిరుపతి నుంచి చిత్తూరు వైపు వెళ్లే రోడ్డులో ద్విచక్ర వాహనంపై వెళుతూ ముందు వెళుతున్న టిప్పర్‌ను ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో సునీల్ అక్కడికక్కడే మృతి చెందగా, ఆయన భార్యకు స్వల్పంగా గాయాలయ్యాయి. బాధితురాలిని చికిత్స నిమిత్తం రుయాస్పత్రిలో చేర్పించారు. మృతుడి తల్లి బనాసి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, టిప్పర్ డ్రైవర్ కృష్ణమూర్తిని అదుపులోకి తీసుకున్నారు.

ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వ పథకాలు అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(విద్య), ఆగస్టు 22: ఎస్సీ, ఎస్టీలు, బడుగు బలహీన వర్గాలకు ప్రభుత్వ పథకాలను పక్కాగా అందించాలని ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ చక్రవర్తి కోరారు. కలెక్టరేట్‌లో గురువారం జరిగిన విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఆయన ప్రసంగించారు. శిథిలావస్థలో ఉన్న హాస్టల్ భవనాలను కూల్చి, వాటి స్థానంలో కొత్తవి కట్టాలన్నారు. మండలాల్లో మంజూరైన అంబేడ్కర్ భవనాల నిర్మాణాలకు ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ఎమ్మెల్యే ఆదిమూలం మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ కేసుల్లో పోలీసులు వాస్తవ పరిస్థితులను తెలుసుకున్నాకే కేసులు నమోదు చేయాలన్నారు. కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీల సమస్యలను పరిష్కరించి.. ఆర్థిక, సామాజిక భద్రత కల్పించడానికే కమిటీ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. పలువురు సభ్యులు మాట్లాడుతూ.. బ్యాంకుల్లో ఎస్సీ, ఎస్టీలకు వ్యక్తిగత, ఎంఎస్ఎంఈ తదితర రుణాల మంజూరుకు చర్యలు తీసుకోవాలని కోరారు. డీఆర్వో పెంచల కిషోర్, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ కన్వీనర్, సాధికార అధికారి చెన్నయ్య, డివిఎంసీ సభ్యులు రాపూరి ప్రసాద్ బాబు, ఎస్వీ రమణయ్య, కేవీ రమణ, వెంకటాచలం తదితరులు పాల్గొన్నారు.

బైకు చోరీ యత్నం: నలుగురిపై కేసు

ఏర్పేడు, ఆగస్టు 22: ద్విచక్ర వాహనాన్ని చోరీయత్నంలో నలుగురు పట్టుబడిన వైనమిది. ఏర్పేడు పోలీసుల కథనం మేరకు వివరాలిలా.. వెంకటగిరి మండలం చిన్నన్నపేటకు చెందిన రాజగోపాల్ గురువారం బైకు మీద ఏర్పేడు మండలం పల్లంపేటకు వచ్చాడు. రోడ్డు పక్కన బైకు పార్క్ చేసి పని చూసుకుని వచ్చే లోపు నలుగురు యువకులు దానిని చోరీ చేసేందుకు ప్రయత్నించారు. వారు వాహనమెక్కి వెళ్లే క్రమంలో స్థానికులు వెంటనే అడ్డుకుని పట్టుకున్నారు. వెంకటగిరికి చెందిన ఆ నలుగురి నిందితులపై పోలీసులు కేసు నమోదు చేశారు.

కంటైనర్ ఢీకొని వృద్ధురాలి మృతి

సత్యవేడు, ఆగస్టు 22: కంటైనర్ ఢీకొని ఓ వృద్ధురాలు మృతి చెందింది. స్థానిక ఎస్ఐ వీరాంజనేయులు తెలిపిన వివరాల మేరకు.. పుదుకుప్పం గ్రామానికి చెందిన వళ్లియమ్మ (85) గురువారం సాయంత్రం సమీపంలోని అడవికి వెళ్లింది. కట్టెల మోపు తీసుకుని ఇంటికి వచ్చే క్రమంలో రోడ్డు దాటుతుండగా ఊత్తుకోట నుంచి శ్రీసిటీ వైపుకు వెళుతున్న కంటైనర్ ఢీకొంది. తీవ్రగాయాలు కావడంతో ఆమెను సత్యవేడు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ వళ్లియమ్మ మరణించింది. ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కంటైనర్ డ్రైవర్‌ను అదుపులో తీసుకున్నారు.

ఎస్వీయూ మాజీ రెక్టార్‌కు పురస్కారం



అవార్డు స్వీకరిస్తున్న జయశంకర్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 22: ఎస్వీయూ మాజీ రెక్టార్, ఫిజిక్స్ విభాగ విశ్రాంతాచార్యుడు సీకే జయశంకర్ జీవన సాఫల్య పురస్కారాన్ని పొందారు. ఫిజిక్స్ బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో జయశంకర్ చేసిన విశేష కృషికి గుర్తింపుగా రేర్ ఎర్త్స్ అసోసియేషన్ ఈ పురస్కారాన్ని ప్రదానం చేసింది. తిరువనంతపురంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో రేర్ ఎర్త్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంఎల్‌పీ రెడ్డి తదితరుల ద్వారా ఈ పురస్కారాన్ని స్వీకరించారు. ఈయన్ను వర్సిటీ ఫిజిక్స్ విభాగ ప్రొఫెసర్ దేవప్రసాద రాజు అభినందించారు.

సఫాయి కర్మచారీల సేవలు అమూల్యమైనవి

తిరుపతి(విద్య), ఆగస్టు 22: సఫాయి కర్మచారీల సేవలు అమూల్యమైనవి కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. ఎస్పీ సుబ్బరాయుడితో కలిసి మాన్యువల్ స్కావెంజర్స్ కమిటీ సమావేశం కలెక్టరేట్‌లో నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. సఫాయి కర్మచారీలకు సంక్షేమ పథకాలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికార అధికారి చెన్నయ్య మాట్లాడు తూ.. తిరుపతిలో మాన్యుహోల్ శుభ్రపరిచే క్రమంలో చనిపోయిన కార్మికులకు నష్టపరిహారం అందించామన్నారు. సభ్యులు చంద్రశేఖర్, ప్రభాకర్ రావు మాట్లాడుతూ.. థియేటర్లు, రైల్వే, మున్సిపల్ పరిధిలో సఫాయి కర్మచారీ పనులు చేసేవారికి యూనిఫాం అందించాలని కోరా రు. అలాగే మహిళలు దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేక గదు లు ఏర్పాటు చేయాలన్నారు. డీఆర్వో పెంచల కిషోర్, అదనపు ఎస్పీలు వెంకట్రావు, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

గూడూరులో కుక్కల బెడద



గూడూరు, ఆగస్టు 22: పట్టణంలోని పలు ప్రాంతాల్లో వీధికుక్కల సంచారం అధికమవడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. మున్సిపల్ అధికారులు వీధికుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టకపోవడంతో కుక్కల సంచారం పెరిగిపోయిందని స్థానికులు చెబుతున్నారు. ప్రధానంగా పాతబస్టాండు, టవర్‌క్లాక్ సెంటర్, ఐసీఎస్ రోడ్డు, మసీదు వీధి, అశోక్‌నగర్, మాళవ్యానగర్, గాంధీనగర్, పాత బస్టాండు, చెన్నూరు తదితర ప్రాంతాల్లో కుక్కల బెడద అధికంగా ఉంది. ఇటీవల మసీదువీధికి చెందిన ఆరేళ్ల చిన్నారి రాత్రి వేళ శివాలయం వీధిలో ఆటలాడుకుని ఇంటికి వెళుతుండగా ఓ వీధికుక్క దాడి చేయడంతో గాయాలపాలైంది. అధికారులు స్పందించి వీధికుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రహదారుల పక్కనే వ్యర్థాల పారవేత



తడ, ఆగస్టు22: తడ మండలంలోని పరిశ్రమలు, సంస్థలు తమ వ్యర్థాలను గుట్టుచప్పుడు కాకుండా రోడ్ల పక్కనే పారవేస్తున్నాయి. పంచాయతీ అధికారులు కొన్ని సార్లు వాటిని పట్టుకుని జరిమాన విధించినా వారిలో మార్పురాలేదు. తాజాగా ఓ పరిశ్రమలో నిరుపయోగంగా ఉన్న ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ అట్టలను భీములవారిపాళెం చెక్‌పోస్టుకు సమీపం నుంచి మాంబట్టు సెజ్ రోడ్డు వరకు ఉన్న జాతీయ రహదారి వెంబడి పలుచోట పారబోశారు. ఇలా వ్యర్థాలను పారవేస్తున్న పరిశ్రమలు, సంస్థలను గుర్తించి అధికారులు కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంది.

వేగంగా వెంకటగిరి-గూడూరు రోడ్డు నిర్మాణం



వెంకటగిరి, ఆగస్టు 22 : ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నారు. రూ.35 కోట్లతో వెంకటగిరి-గూడూరు రోడ్డు నిర్మాణ పనులు వేగవంతమయ్యాయి. వెంకటగిరి నుంచి బాలాయపల్లి వరకు ఈ రోడ్డు నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. గతంలో ఈ రోడ్డు నిర్మాణం పనులు చేపట్టిన కాంట్రాక్టర్ బిల్లులు రావన్న భయంతో పనులను అర్ధాంతరంగా ఆపేశారు. అదేవిధంగా రాపూరు-గూడూరు మధ్య రోడ్డు నిర్మాణ పనులు దాదాపుగా పూర్తి కావస్తుండటంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధ్యాయుల సర్దుబాటుపై కౌన్సెలింగ్

కోట, ఆగస్టు 22 : కోటలోని విద్యావనరుల కేంద్రంలో గురువారం పని సర్దుబాటుపై ఉపాధ్యాయులకు ఎంఈవో మస్తానయ్య గురువారం కౌన్సెలింగ్ నిర్వహించారు. మండలంలోని 5 మంది ఉపాధ్యాయులకు గాను ఇద్దరు ఊనుగుంటపాళెం పాఠశాలకు ఒక్కరు గోవిందపల్లి పాఠశాలకు పనిసర్దుబాటు కింద బదిలీ కాగా, మరో ఇద్దరు ఉపాధ్యాయులు డివిజన్‌స్థాయి బదిలీలకు కోరుకున్నట్లు ఎంఈవో తెలిపారు. ఈ మేరకు వర్క్ అజీస్ట్‌మెంట్ ప్రక్రియను పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు.

భూ పరిహారం చెల్లింపుపై గ్రామసభ

చిల్లకూరు, ఆగస్టు 22: మండలంలోని లింగవరం సచివాలయంలో గురువారం చెన్నై-బెంగుళూరు కోస్టల్ కారిడార్ భూముల సాగుదారులకు పరిహారం చెల్లింపుపై రెవెన్యూ అధికారులు గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు శ్రీనివాసులు మాట్లాడుతూ తమ్మినపట్నం, గుమ్మళ్లదిబ్బ, లింగవరం, పల్లివానిదిబ్బ, తీగపాళెం, తాళ్లబైట, గోనుగుంట గ్రామాల్లో కోస్టర్ కారిడార్‌కు కేటాయించిన 914 ఎకరాల భూముల్లో సర్వేచేసి సాగుదారుల జాబితాను గ్రామసభలో వెల్లడించామన్నారు. అభ్యంతరాలుంటే తెలపాలని సాగుదారులకు సూచించామన్నారు. దీంతో విస్తీర్ణంలో తేడా వచ్చిందని, పేర్లు మార్పు జరిగాయని పలువురు సాగుదారులు అర్జీల రూపంలో అభ్యంతరాలను వ్యక్తం చేశారన్నారు. వాటిపై మరల సర్వే నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమంలో గూడూరు, చిట్టమూరు, వాకాడు మండలాల డిప్యూటీ తహసీల్దార్లు సురేంద్ర, విజయలక్ష్మి, సందీప్, నిరంజన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో మౌలిక వసతులు కల్పించండి

- డీఆర్‌ఎం విశ్వనాథ్‌కు ఆర్యవైశ్య సంఘ నాయకుల వినతి



ప్రయాణికులతో మాట్లాడుతున్న డీఆర్‌ఎం

నాయుడుపేట/టౌన్, ఆగస్టు 22 : నాయుడుపేట రైల్వేస్టేషన్‌లో మౌలిక వసతు లు కల్పించాలని రైల్వే డీఆర్‌ఎం విశ్వనాథ్‌కు ఆర్యవైశ్య సంఘ నాయకులు వినతిపత్రం అందజేశారు. గురువారం నాయుడుపేట రైల్వేస్టేషన్‌ను డీఆర్‌ఎం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అదే సమయంలో స్టేషన్‌లో తాగునీటి వసతి లేకపోవడం, చెత్తబుట్టల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతోపాటు స్టేషన్ ఆవరణలో నిబంధనలను అతిక్రమించి వాహనాలు పార్కింగ్ చేసి ఉండటాన్ని డీఆర్‌ఎం అసహనం వ్యక్తం చేశారు. రద్దు చేసిన రైళ్లను పునరుద్ధరించాలని, అదనపు కౌంటర్‌ను ఏర్పాటు చేయాలని ఆర్యవైశ్యసంఘ నాయకులు డీఆర్‌ఎంను కోరారు.

మహా చండీ హోమం

వెంకటగిరిటౌన్, ఆగస్టు 22: పట్టణంలోని 3వ వార్డులో వెలసిన విష్ణుదుర్గాపరమేశ్వరి శక్తిపీఠంలో స్వామి వివేకానంద యువ సైన్యం ఆధ్వర్యంలో గురువారం మహాచండీ హోమం నిర్వహించారు. నిర్వహకులు ప్రకృతికుమార్ మాట్లాడుతూ వెంకటగిరిలో అందరూ సుభిక్షంగా ఉండాలని హోమం చేశామన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఎమ్మెల్యేను కలిసిన మాజీ ఎంపీ



గూడూరు, ఆగస్టు 22: ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్‌ను ఆయన నివాసంలో గురువారం మాజీ ఎంపీ వరప్రసాద్‌రావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనులపై ఎమ్మెల్యేతో చర్చించారు. కార్యక్రమంలో నరసప్ప, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

బాలసదనంలో చిరంజీవి పుట్టినరోజు సంబరాలు

కోట, ఆగస్టు22 : పట్టణంలోని బాలసదనం, కారు స్టాండ్ సెంటర్లలో గురువారం సినీ నటుడు చిరంజీవి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. బాలసదనంలో చిరంజీవి అభిమానులు కేక్ కట్‌చేసి ఎస్‌ఐ పవన్‌కుమార్ చేతులమీదుగా చిన్నారులకు పంచి పెట్టారు. అభిమానులు అల్లంబాబు, కోటేశ్వరరావు, మల్లికార్జున్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

24న గంధ మహోత్సవం

గూడూరు అర్బన్, ఆగస్టు 22: స్థానిక దర్గావీధిలోని హజరత్‌సయ్యద్‌జాఫర్ మస్తాన్ ఔలియా దర్గాలో శనివారం గంధ మహోత్సవం నిర్వహించనున్నట్లు ముజావర్ మగ్దూం గురువారం తెలిపారు. గంధమహోత్సవం సందర్భంగా ప్రత్యేక ప్రార్ధనలు ఉంటాయని తెలిపారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

చిట్టమూరులో భారీ వర్షం

చిట్టమూరు, ఆగస్టు 22 : చిట్టమూరు మండలంలో గురువారం సాయంత్రం భారీ వర్షం పడింది. అరగంటపాటు కురిసిన వర్షంతో పొలాల్లో నీళ్లు నిలిచిపోయాయి. చిట్టమూరు, మెట్టు, ఈశ్వరవాక, గునపాడు, గునపాటిపాళెం గ్రామాల్లో వరి పంటలు కోత దశలో ఉండడంతో రైతులు ఉక్కిరిబిక్కిరయ్యారు. మండలంలో కొన్ని గ్రామాల్లో మాత్రమే భారీ వర్షం పడింది.

రేపు చిట్టమూరు మండల సమావేశం

చిట్టమూరు, ఆగస్టు22: ఈనెల 24న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సాలెడ్ తెలిపారు. శనివారం ఉదయం 10గంటలకు చిట్టమూరు స్త్రీ సంక్షేమ భవనం మీటింగ్ హాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు పాల్గొనాలని తెలిపారు.

నేడు ఓజిలిలో గ్రామసభలు

ఓజిలి, ఆగస్టు 22 : ఓజిలి మండలంలో శుక్రవారం గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రజనీకాంత్ తెలిపారు. ఆయా పంచాయతీలలో సర్పంచుల అధ్యక్షతన ఈ సభలు నిర్వహించనున్నామన్నారు. గ్రామ సమస్యలతోపాటు ఉపాధిహామీ పథకంపై కూడా చర్చలు, సమీక్షలు ఉంటాయని తెలిపారు. సంబంధిత కార్యదర్శులు, అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.

జనసేన గ్లాసుల పంపిణీ

కోట, ఆగస్టు 22 : కోట పట్టణంలోని పలు టీ దుకాణాలకు గురువారం జనసేన పార్టీ గుర్తు అయిన టీ గాజు గ్లాసులను గురువారం కూటమి నాయకులు పంపిణీ చేశారు. ఈ మేరకు జనసేన జిల్లా కార్యవర్గ సభ్యుడు అల్లంబాబు, టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి డాక్టర్ తిరుమలశెట్టి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో బజారుసెంటర్, ఆర్టీసీ సెంటర్, క్రాస్‌రోడ్డు సెంటర్లలో టీ గాజు గ్లాసులను ఉచితంగా పంపిణీ చేశారు.

రోగులకు చీరల పంపిణీ

కోట, ఆగస్టు 22 : కోట ఆసుపత్రిలో గురువారం మహిళా రోగులకు షిరిడీ సాయిబాబా అక్షయ సేవాసమితి ఆధ్వర్యంలో చీరలు పంపిణీ చేశారు. చెన్నైకు చెందిన ప్రముఖ వ్యాపారి నాగలాపురం గిరిధర్‌రెడ్డి - మహేశ్వరమ్మల దాతృత్వంతో ఈ చీరలను మహిళా రోగులకు అందజేశారు. అదేవిధంగా నెల్లూరుకు చెందిన రాపూరు చంద్రాచారి దాతృత్వంతో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు అల్లం రమణయ్య, ఆవుల సుబ్బయ్య, మారం బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఐకి టీడీపీ నేతల అభినందన



కోట, ఆగస్టు22: కోట పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ పవన్ కుమార్‌ను గురువారం టీడీపీ నాయకులు శాలువాలు, మెమెంటోలతో అభినందించారు. టీడీపీ మైనార్టీసెల్ అధ్యక్షుడు మస్తాన్ బాషా, వెంకన్నపాళెం సర్పంచ్ మధుయాదవ్, నాయకులు రాజ్‌కిషోర్, యల్లశిరి వెంకటేశ్వర్లు, ప్రముఖ వ్యాపారి రాయపు సుబ్రహ్మణ్యం (మణి)లు ఎస్‌ఐను అభినందించారు.

సుందరరాజస్వామికి వైభవంగా తిరుచ్చి ఉత్సవం



తిరుచానూరు, ఆగస్టు 22: తిరుచానూరులో కొలువై ఉన్న సుందరరాజస్వామికి గురువారం రాత్రి వైభవంగా తిరుచ్చి ఉత్సవం జరిగింది. స్వామివారి జన్మనక్షత్రం ఉత్తరాభాద్రను పురస్కరించుకుని ఆలయంలో ఉత్సవర్లకు నేత్రపర్వంగా అభిషేకం నిర్వహించారు. సాయంత్రం సర్వాలంకార శోభితులైన శ్రీదేవి, భూదేవి సమేత సుందరరాజస్వామి బంగారు తిరుచ్చిపై కొలువుదీరి తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు సాక్షాత్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో రమేష్, ఏవీఎస్‌వో సతీష్‌కుమార్, శేషగిరి, మధు, గణేష్, సుభాస్కర్ నాయుడు, ప్రసాద్ పాల్గొన్నారు.

నకిలీ టూరిజం టిక్కెట్ల కేసులో విచారణ వేగవంతం

తిరుమల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): టూరిజం టిక్కెట్ల పేరుతో నకిలీ టిక్కెట్లు సృష్టించి అక్రమాలకు పాల్పడిన కేసు విచారణను పోలీసులు వేగవంతం చేశారు. చెన్నైకి చెందిన ఓ ట్రావెల్స్ సంస్థ నిర్వాహకులతో కుమ్మక్కై, నకిలీ టిక్కెట్లను స్కాన్ చేస్తున్నట్టు నటించి భక్తులను అనుమతిస్తున్న అక్రమం ఇటీవల వెలుగు చూసిన విషయం తెలిసిందే. ఈకేసులో కాంట్రాక్ట్ ఉద్యోగి రుద్రసాగర్‌తో పాటు కేవీఎస్ సంస్థలో పనిచేసిన మాజీ ఉద్యోగి నవీన్, ట్రావెల్స్‌కు చెందిన ఓ వ్యక్తితో సహా ముగ్గురిని విజిలెన్స్ ఫిర్యాదు మేరకు పోలీసులు అరెస్ట్ చేశారు. మరో ముగ్గురికోసం గాలిస్తున్నారు. ఈ కేసులో ఎవరెవరు ఉన్నారు, వీరికి టీటీడీ ఉద్యోగులు ఏమైనా సహకరించారా, ఈ అక్రమం ఎప్పటి నుంచి సాగుతోంది, ఎంత అక్రమానికి పాల్పడ్డారనే అంశాలపై తిరుమల టూటౌన్ సీఐ సత్యనారాయణ విచారణ చేస్తున్నారు. కేసుకు సంబంధించి రెండు బృందాలను చెన్నై, బెంగళూరుకు పంపినట్టు సమాచారం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కేసులో ఎంతటి పెద్దవారున్నా అరెస్ట్ చేసే దిశగా పోలీసుల దర్యాప్తు సాగుతోంది.

అటకెక్కిన ఆధునికీకరణ పనులు

బిల్లులు రాక కాలువ పనులు ఆపేసిన కాంట్రాక్టర్లు





సూళ్లూరుపేటలో కోతకు గురైన నెర్రికాలువ కాంక్రీట్, కాలువలో వ్యర్థాలు, పిచ్చిమొక్కలు

సూళ్లూరుపేట, ఆగస్టు22: వైసీపీ పాలనలో జలవనరుల శాఖలో ఆధునికీకరణ పనుల్లో తీవ్ర జాప్యం జరిగింది. నాలుగేళ్ల కిందట మంజూరైన పనులను ఎక్కడికక్కడే కాంట్రక్టర్లు నిలిపివేశారు. ఆరంభంలో పనులు ప్రారంభించి కొంతమేర చేసినా బిల్లులు రాకపోవడంతో పనులు ఆపేసి యంత్ర పరికరాలు సైతం తరలించేశారు. దీంతో ఈ ప్రాంతంలో రైతులు తీవ్రంగా నష్టపోయారు. సూళ్లూరుపేట నియోజకవర్గంలో నాలుగుపనులకు రూ.71.54 కోట్లు మంజూరు చేశారు. అప్పటి జలవనరుల శాఖ మంత్రి అనిల్‌కుమార్ ఇక్కడ పర్యటించి సూళ్లూరుపేట, తడ, దొరవారిసత్రం మండలాల్లో ప్రవహించే నెర్రికాలువ ఆధునికీకరణకు రూ. 27.19 కోట్లు, తడ మండలం ఎన్‌ఎం కండ్రిగ దగ్గర పాముల కాలువకు రూ.3.96 కోట్లు మంజూరు చేశారు. అంతేకాకుండా 2019లో మంత్రి సూళ్లూరుపేట వినాయకుడి గుడి వద్ద భూమి పూజచేసి ఏడాదిలోపు పూర్తి చేస్తామన్నారు. అదేవిధంగా పెళ్లకూరు మండలం పాలచ్చూరు ఆనకట్ట సిస్టమ్ ఆధునికీకరణకు రూ.31.65 కోట్లు మంజూరు చేశారు. టెండర్లు దక్కించుకొన్న కాంట్రక్టర్లు పనులు చేపట్టారు.

బిల్లులు రాక ఆగిన నెర్రికాలువ ఆధునికీకరణ

కాళంగి నది అనుసంధానంగా ఉన్న నెర్రికాలువ దొరవారిసత్రం మండలం తనియాలి వద్ద నుంచి సూళ్లూరుపేట, తడ మండలాల్లో 17.5 కి.మీ వరకు విస్తరించి ఉంది. దాదాపు నెర్రికాలువ ద్వారా 20 వేల ఎకరాలకుపైగా సాగునీరందుతోంది. సూళ్లూరుపేట మున్సిపాలిటీకి తాగునీరందించే సమ్మర్ స్టోరేజ్‌కి కూడా ఇదే ఆధారం. ఇలాంటి కాలువ పలుచోట్ల కోతకు గురై వ్యర్థాలతో నిండిపోయి సాగునీరు సక్రమంగా అందడం లేదు. దీని బాగుకోసం అప్పట్లో రూ.27.19 కోట్లు నిధులు మంజూరు చేశారు. దొరవారిసత్ర మండల పరిధిలో రెండు కిలోమీటర్లు, సూళ్లూరుపేట మండలంలో అర కిలోమీటరు మేర సిమెంట్‌తో కాంక్రీట్ గోడ నిర్మించారు. ఈ పనులకు సంబంధించి దాదాపు రూ.2.40 కోట్లు బిల్లులు చెల్లించేందుకు ఇంజినీర్లు మెజర్‌మెంట్ పుస్తకాలు సిద్ధం చేసి 2022లో ప్రభుత్వానికి పంపారు. బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు ఆపేశారు. పెళ్లకూరు, నాయుడుపేట, ఓజిలి మండలాలకు మేలుచేసే పాలచ్చూరు ఆనకట్ట సిస్టమ్ లైనింగ్ పనులు 2020 ఆర్థిక సంవత్సరం చివర్లో పనులు మొదలు పెట్టారు. కాంక్రీట్ లైనింగ్, చిన్న వంతెనల నిర్మాణాలు ప్రారంభించి 5 కి.మీ మేర పూర్తిచేసి అర్థాంతంగా వదిలేశారు. బిల్లులు ప్రభుత్వం చెల్లించకపోవడంతో ఈ సంస్థ పనులు చేయకుండా వెనక్కి వెళ్లింది. ఓజిలి మండలంలో అసలు పనులే మొదలు పెట్టలేదు. గతేడాది డిసెంబరులో వచ్చిన వరదలకు చేసిన పనులు చాలాచోట్ల దెబ్బతిన్నాయి. వర్షపు నీరు కూడా నిలవడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. గత పాలకులు చేసిన తప్పులను సరిచేసి రైతులకు సాగునీరందించే విధంగా ఆగిన ఆధునికీకరణ పనులు పూర్తి చేస్తారని కోటి ఆశలతో రైతులు ఎదురు చూస్తున్నారు.





పోలీస్‌స్టేషన్‌లో కొట్టుకుంటుండగా అడ్డుకుంటున్న పోలీసులు

పోలీసుల ఎదుటే డిష్యుం డిష్యుం

కొందరికి గాయాలు - పాత కక్షలతో రెండు కుటుంబాల మధ్య ఘర్షణ

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 22: పోలీసుల ఎదుటే రెండు కుటుంబాలకు చెందిన 15 మంది కొట్టుకున్నారు. కొందరు గాయపడ్డారు. తిరుపతి రూరల్ సర్కిల్ స్టేషన్ వద్ద గురువారం సాయంత్రం ఈ ఘటన జరిగింది. తిరుపతి రూరల్ పరిధిలోని కాలూరుకు చెందిన గోపి అతని కుమారుడు వెంకటకిరణ్, పక్కింటిలో కాపురముంటూ గ్యాస్ సరఫరా చేస్తున్న జానకిరాం మధ్య పాత కక్షలున్నాయి. కొద్ది రోజులుగా వీరి మధ్య విభేదాలు తారస్థాయికి చేరాయి. ఈ క్రమంలో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయడానికి వచ్చిన జానకిరాంను మరో వర్గానికి చెందిన వారు స్టేషన్ ఎదుటే దుర్భాషలాడారు. మాటా మాటా పెరిగి స్టేషన్ వద్ద ఎస్‌ఐ షేక్ షావలి, సిబ్బంది ఎదుట కొట్టుకోవడం మొదలుపెట్టారు. అక్కడున్న పోలీసులు వారిని వారించే ప్రయత్నం చేసినా పట్టించుకోకుండా మహిళలు, పురుషులూ కొట్లాటకు దిగారు. ఓ మహిళ కిందపడ్డారు. కొందరు గాయపడ్డారు. మహిళలపై ఎస్‌ఐ ఎదుటే దౌర్జన్యానికి దిగిన ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు విచారిస్తున్నామని ఎస్‌ఐ నాగేంద్రబాబు తెలిపారు.

భక్తులు మెచ్చేలా వెంకటగిరి పోలేరమ్మ జాతర

ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, ఆగస్టు 22 :ఈ ఏడాది సెప్టెంబరు నెలలో జరిగే వెంకటగిరి పోలేరమ్మ జాతరను భక్తులు మెచ్చేవిధంగా నిర్వహిస్తామని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. గురువారం ఆయన పోలేరమ్మ పుట్టింటిని సందర్శించి జాతర ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ పోలేరమ్మ జాతరను ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించిందన్నారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. వార్డుల్లో మంచినీటి వసతి, రోడ్లు, డ్రయిన్లు, పారిశుధ్య పరిస్థితులు చక్కదిద్దడం వంటి పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయ మార్కెటింగ్ మాజీ చైర్మన్ పులికొల్లు రాజేశ్వరరావు, రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షుడు కేవీకే ప్రసాద్ నాయుడు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బీరం రాజేశ్వరరావు, పట్టణ మాజీ అధ్యక్షుడు మంకు ఆనంద్, బీసీ నాయకులు అవ్వారు సత్యనారాయణ, చంద్రారెడ్డి, నరసింహులు పాల్గొన్నారు.



పోలేరమ్మ జాతర ఏర్పాట్లపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామకృష్ణ

విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలి



కళాశాలలో వసతులను పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు

డక్కిలి, ఆగస్టు 22: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంతోపాటు పరిసరాల పరిశుభ్రతను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తహసీల్దార్ శ్రీనివాసులు సూచించారు. గురువారం స్థానిక బాలకల గురుకుల కళాశాలను సందర్శించిన ఆయన మరుగుదొడ్లు, వంటశాల, వసతి గదులు, తరగతి గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ఈ కళాశాలలో ఓ విద్యార్థిని అనారోగ్యంతో చనిపోవడం బాధాకరమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌కు సూచించారు. విద్యార్థులు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇక కళాశాలలో ఆర్వో ప్లాంటు పనిచేయక పోవడాన్ని గుర్తించి వెంటనే ఆర్వో ప్లాంటుకు మరమ్మతులు చేపట్టి విద్యార్థులకు శుద్ధి జలాలను అందిందాలని చెప్పారు.

గురుకుల పాఠశాల తనిఖీ

వాకాడు, ఆగస్టు 22 : మండలంలోని వాకాడు సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో ఎంపీడీవో వెంకటేశ్వరరావు, ఎంఈవో నసీంఆలీతో కలసి తహసీల్దారు రామయ్య గురువారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో వసతులు, సౌకర్యాలు, మెనూ తదితర అంశాలపై విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు వండించే భోజన నాణ్యతను పరిశీలించారు. భోజనం మరింత రుచికరంగా వండేలా చూడాలని ఆదేశించారు. మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని సూచించారు. వారంరోజుల్లో మరోసారి పాఠశాలను తనిఖీకి వస్తామన్నారు. పాఠశాలలో పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ విజయ్, సిబ్బంది ఉన్నారు.



భోజన నాణ్యతను పరిశీలిస్తున్న తహసీల్దారు రామయ్య

మద్యం బాటిళ్ళ పట్టివేత



పెళ్లకూరు, ఆగస్టు 22 : మండలంలోని పుల్లూరుకు చెందిన ఎం.దుర్గారావు, ప్రసాద్‌లు మద్యం తరలిస్తుండగా పోలీసులకు పట్టుబడ్డారు. ఎస్‌ఐ శ్రీకాంత్ సమాచారం మేరకు... కలవకూరు-పుల్లూరు గ్రామాల మధ్య తన సిబ్బందితో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంలో అనుమానాస్పదంగా వెళుతూ కనిపించారు. దీంతో ఎస్‌ఐ శ్రీకాంత్ వారిని నిలిపి పరిశీలించగా వారి వద్ద 21 మద్యం బాటిళ్ళు ఉండడాన్ని గమనించారు. వాటిలో 8 రాయల్ స్టాగ్ ఫుల్ బాటిళ్లు, 10 కింగ్‌వెల్ క్వార్టర్లు, మూడు బీర్లు ఉన్నాయి. మద్యం బాటిళ్ళతోపాటు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆడపిల్లలను కాపాడుకుందాం

కోట, ఆగస్టు 22 : ఆడ పిల్లలకు చిన్నవయసులోనే వివాహాలు చేసి వారి ఆయుష్షును హరించే సంప్రదాయాన్ని తరిమికొడదామంటూ సీడీపీవో మునికుమారి పిలుపునిచ్చారు. కోట బాలికోన్నత పాఠశాలలో గురువారం బాల్య వివాహాల నిర్మూలన, చోటీ బచ్చావో... చోటీ పడావో... కార్యక్రమాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఆడబిడ్డ వివాహం చేసుకోవాల్సి ఉండగా, గ్రామాల్లో అనాగరికత సంస్కృతి, సంప్రదాయాలకు గ్రామీణులు ఆజ్యం పోస్తున్నారన్నారు. ఇలాంటి సంప్రదాయాలను ప్రతి ఆడపిల్ల వ్యతిరేకించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలకు సంబంధించిన పోస్టర్లను సీడీపీవో, సూపర్‌వైజర్ కృష్ణమ్మ, ఉపాధ్యాయులు ఆవిష్కరించారు.



మాట్లాడుతున్న సీడీపీవో మునికుమారి

శ్రీకాళహస్తి
సత్యవేడు

శాస్త్రోక్తంగా గురుదక్షిణామూర్తికి పూజలు



శ్రీకాళహస్తి, ఆగస్టు 22: శ్రీకాళహస్తీశ్వరాలయంలో మేథో గురుదక్షిణామూర్తికి గురువారం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. కలశ ప్రతిష్ఠ అనంతరం వినాయక పూజల కలశ పూజ వైదిక క్రతువులు, అభిషేకం నిర్వహించారు. సుగంధ పూలు, స్వర్ణాభరణాలతో విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. మహామంగళ హారతులు ఇచ్చారు. భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

కోల్‌కతా ఘటనకు విద్యార్థుల నిరసన



రేణిగుంట, ఆగస్టు 22: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచారాన్ని ఐద్వా, ప్రగతి సంస్థ మహిళా సంఘాలు ఖండించాయి. ఈ సంఘటనకు నిరసనగా ఈ సంఘాలు చేపట్టిన ప్రదర్శనలో స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని వీరంతా డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం విష్ణువర్ధణి, ఎంపీటీసీ రాజేశ్వరి, ఐద్వా నాయకులు సత్య, శ్రీలక్ష్మి, అంగన్‌వాడీ నాయకులు ధనమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

కేజీబీవీలో తహసీల్దార్ తనిఖీలు



కేవీబీపురం, ఆగస్టు 22: మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల విద్యాలయాన్ని తహసీల్దారు దస్తగిరయ్య గురువారం తనిఖీ నిర్వహించారు. విద్యార్థులను విచారించి వసతులపై ఆరా తీశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు సరఫరా చేస్తున్న పాలు, నిత్యావసర సరుకులను తనిఖీ చేశారు. వసతిగృహంలోని శానిటేషన్ మరింత మెరుగుపరచాలని సూచించారు. కార్యక్రమంలో వీఆర్వో మునిగోపాల్, ప్రత్యేకాధికారి సుకన్య పాల్గొన్నారు. **బుచ్చినాయుడుకండ్రిగ:** స్థానిక ఎస్సీ బాలుర వసతి గృహంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తహసీల్దార్ సుబ్రమణ్యం సూచించారు. వసతి గృహాన్ని ఆయన గురువారం తనిఖీ చేశారు. పరిసరాలు, మరుగుదొడ్లు, వంట గది, భోజనంపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఎంఈవో రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు సూచనలిస్తున్న వెంకటేశ్వర్లు.

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 22: మండల కేంద్రంలోని అక్షర స్కూల్ విద్యార్థులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ దివాకర్ మాట్లాడుతూ దోమలు కుట్టినా, కలుషిత నీరు తాగినా గాని జ్వరాల బారినపడతారన్నారు. దోమలు చేరకుండా ఎరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, కరస్పాండెంట్ ప్రతాప్ పాల్గొన్నారు.

టీడీపీ నేతలకు ఆలయ కమిటీ సన్మానం



ఏర్పేడు, ఆగస్టు 22: టీడీపీ నాయకులు, మాజీ జడ్పీటీసీ పేరం ధనంజయలనాయుడు, వేమూరి బాలాజీనాయుడు, గుడిమల్లం ఆలయ మాజీ చైర్మన్ బత్తల గిరినాయుడు, తెలుగు యువత నాయకులు పేరం నాగరాజునాయుడులను పాపానాయుడుపేట ధర్మరాజులస్వామి ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. పదిరోజులుగా జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం టీడీపీ నేతలు ధర్మరాజులస్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఆలయ కమిటీ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసింది. అనంతరం సన్మానించారు. కార్యక్రమంలో అర్జునబాబు, లలితాకరుణాకర్, కృష్ణప్ప మొదలియార్, రోశయ్య పాల్గొన్నారు.

ఘనంగా చిరంజీవి జన్మదిన వేడుకలు



అన్నదానం చేస్తున్న వినుత తదితరులు

శ్రీకాళహస్తి, ఆగస్టు 22: సినీనటుడు చిరంజీవి జన్మదిన వేడుకలను గురువారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. పెండ్లి మండపం వద్ద నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి కోట వినుత ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. అంబేడ్కర్ కూడలి వద్ద కూడా అన్నదానం చేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణాధ్యక్షుడు తోట గణేష్, కోట చంద్రబాబు, పేట చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. కొత్తపేటలోని కార్గిల్ సెంటర్‌లో చిరంజీవి అభిమానులు నిర్వహించిన కార్యక్రమంలో జనసేన ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి కొట్టే సాయి, అభిమానులు వేణుగోపాల్‌నాయుడు, పగడాల ప్రతాప్, నవీన్‌కుమార్, సుధాకర్, నవనీతం, కృష్ణయ్య, సిద్ధులు గారి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. **వరదయ్యపాళెం:** వెంకటేశ్వరస్వామి ఆలయంలో చిరు అభిమానులు పూజలు నిర్వహించారు. అనంతరం బస్టాండు వద్ కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు

సత్యవేడు, ఆగస్టు 22: సత్యవేడు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది దాసరి వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయంలో కార్యవర్గం ఎన్నిక జరిగింది. వైస్ ప్రెసిడెంట్‌గా ఎస్.చంద్రశేఖర్, సెక్రటరీగా వీ.ముని చంద్రశేఖర్, జాయింట్ సెక్రటరీగా దేవానంద్, ట్రెజరర్‌గా బీ.జానయ్యను ఎన్నుకున్నారు.

రేపు బాలుర అండర్-14 క్రికెట్ జట్టు ఎంపిక

శ్రీకాళహస్తి, ఆగస్టు 22:పట్టణంలోని కేసీసీ క్రికెట్ నెట్స్ ప్రాంగణంలో శనివారం మధ్యాహ్నం 2గంటలకు ఉమ్మడి చిత్తూరు జిల్లా బాలుర అండర్-14 క్రికెట్ జట్టును ఎంపిక చేయనున్నట్లు ఇన్‌ఛార్జి దుర్గాప్రసాద్ (కన్నా), గోపాల్ తెలిపారు.ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. శ్రీకాళహస్తి రూరల్, అర్బన్, తొట్టంబేడు, కేవీబీపురం, ఏర్పేడు మండలాల క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. క్రీడాకారులు ఆధార్‌కార్డు, బర్త్ సర్టిఫికెట్, కిట్, తెల్లని దుస్తులతో రావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 8341540009, 9949665350 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

మున్సిపల్ కమిషనర్ బదిలీ



శ్రీకాళహస్తి, ఆగస్టు 22: పురపాలక సంఘం కమిషనర్ రమేష్‌బాబు పొన్నూరుకు బదిలీ అయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు గురువారం పలువురు కమిషనర్లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా ఆయనకు స్థానచలనం కల్పించారు. కొత్త కమిషనర్ ఎవరనేది ఇంకా ఖరారు కాలేదు.

కంటైనర్ ఢీకొని వృద్ధురాలి మృతి

సత్యవేడు, ఆగస్టు 22: కంటైనర్ ఢీకొని ఓ వృద్ధురాలు మృతి చెందింది. స్థానిక ఎస్ఐ వీరాంజనేయులు తెలిపిన వివరాల మేరకు.. పుదుకుప్పం గ్రామానికి చెందిన వళ్ళియమ్మ (85) గురువారం సాయంత్రం సమీపంలోని అడవికి వెళ్ళింది. కట్టెలమోపు తీసుకుని ఇంటికి వచ్చే క్రమంలో రోడ్డు దాటుతుండగా ఊత్తుకోట నుంచి శ్రీసిటీ వైపుకు వెళుతున్న కంటైనర్ ఢీకొంది. తీవ్రగాయాలు కావడంతో ఆమెను సత్యవేడు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ వళ్లియమ్మ మరణించింది. ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కంటైనర్ డ్రైవర్‌ను అదుపులో తీసుకున్నారు.

డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులకు శిక్షణ

సత్యవేడు, ఆగస్టు 22: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ ఆవరణలోని స్కిల్‌హబ్ సెంటర్‌లో డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సు ఉచిత శిక్షణ తరగతులను ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఉషాదేవి ఈమేరకు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టెన్త్ ఆపై విద్యార్హత కలిగి, 15 నుంచి 40 సంవత్సరాల లోపున్న వారు అర్హులన్నారు. శిక్షణ పూర్తయ్యాక స్కిల్ ఇండియా సర్టిఫికేషన్‌తో పాటు ఏదైనా కంపెనీలలో ఉపాధి కల్పించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని ఆసక్తిగలిగిన యువతీయువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9440374535, 9985344 506 ఫోన్ నంబరలో సంప్రదించాలన్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌కు జైలుశిక్ష

సత్యవేడు, ఆగస్టు 22: రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి చెందిన కేసులో ఆర్టీసీ డ్రైవర్‌కు కోర్టు ఏడాది జైలు శిక్ష విధించింది. ఎస్ఐ వీరాంజనేయులు తెలిపిన వివరాల మేరకు మదనంబేడులో 2019 జూలై 4న రోడ్డు ప్రమాదం జరిగింది. రోడ్డు దాటుతున్న పురంధర్ (4)ను సత్యవేడు ఆర్టీసీ డిపో బస్సు ఢీకొంది. దీంతో బాలుడు మృతి చెందాడు. అప్పట్లో ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేశారు. సత్యవేడు జూనియర్ సివిల్ కోర్టులో కేసు దాఖలు చేశారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ నాగేంద్రబాబుకు రెండేళ్ల జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ ఇన్‌ఛార్జి న్యాయమూర్తి గోపాలకృష్ణ గురువారం తీర్పునిచ్చారు.

బైకు చోరీ యత్నం: నలుగురిపై కేసు

ఏర్పేడు, ఆగస్టు 22: ద్విచక్ర వాహనాన్ని చోరీయత్నంలో నలుగురు పట్టుబడిన ఘైనమిది. ఏర్పేడు పోలీసుల కథనం మేరకు వివరాలిలా.. వెంకటగిరి మండలం చిన్నన్నపేటకు చెందిన రాజగోపాల్ గురువారం బైకు మీద ఏర్పేడు మండలం పల్లంపేటకు వచ్చాడు. రోడ్డు పక్కన బైకు పార్క్ చేసి పని చూసుకుని వచ్చే లోపు నలుగురు యువకులు దానిని చోరీ చేసేందుకు ప్రయత్నించారు. వారు వాహనమెక్కి వెళ్లే క్రమంలో స్థానికులు వెంటనే అడ్డుకుని పట్టుకున్నారు. వెంకటగిరికి చెందిన ఆ నలుగురి నిందితులపై పోలీసులు కేసు నమోదు చేశారు.

వైసీపీ నేత భూ అక్రమాలపై పరిశీలన

- బాధిత ఎస్టీలకు న్యాయం చేస్తానని తహసీల్దార్ హామీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



బాధిత రైతులతో మాట్లాడుతున్న భార్గవి

ఏర్పేడు, ఆగస్టు 22: మునలిపేడుకు చెందిన నలుగురు ఎస్టీల భూముల్ని రికార్డుల్లో మార్చి వైసీపీ నాయకులు హస్తగతం చేసుకున్న వైనంపై తహసీల్దార్ భార్గవి స్పందించారు. శ్రీకాళహస్తి మండల వైసీపీ ముఖ్యనేత తన బంధువుల పేరిట వెబ్‌ల్యాండ్‌లో మార్చేసి అక్రమంగా పట్టాలు సృష్టించుకున్నారని ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. గురువారం తహసీల్దారు సిబ్బందితో కలిసి గురువారం మునలిపేడు వెళ్లి ఎస్టీల భూములను పరిశీలించారు. 30 ఏళ్ల నాటి పట్టా, పాసుపుస్తకాలను పరిశీలించారు. వెబ్‌ల్యాండ్‌లో ఎస్టీల భూములను తమ పేరిట మార్చుకున్నారనే ఆరోపణలపై పుట్టారెడ్డిని పిలిపించారు. రికార్డులను చూపాలని ప్రశ్నించారు. ఆయన అధికారులకు పొంతన లేని సమాధానం చెప్పారు. బ్యాంకులో పెట్టి రుణం పొందామని, పదిరోజుల్లో ఆధారాలను చూపిస్తామన్నారు. 30 ఏళ్ల నుంచి ఎస్టీలు సాగు చేసుకుంటున్న భూములను ఎలా మార్చుకుంటారని తహసీల్దారు ప్రశ్నించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఈ ఏడాది జనవరిలో ఆన్‌లైన్‌లో భూములను మార్చారన్నారు. ఇది చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. పూర్తిస్థాయిలో విచారించి బాధిత ఎస్టీ రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కాగా బాధితులకు న్యాయం జరిగే వరకు నిరసన చేపడతామని సీపీఐ ఏరియా కార్యదర్శి జనమాల గురవయ్య ఒక ప్రకటనలో హెచ్చరించారు.

మాజీ ఎమ్మెల్యే బలవంతంతోనే సంతకాలు

మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఫోన్ చేసి భయపెట్టడం వల్లే ఎస్టీల భూముల మార్పు ఫైల్‌లో సంతకాలు పెట్టాల్సి వచ్చిందని ఓ వీఆర్వో చెప్పారు. భూములను తమ పేరిట మార్చాలని శ్రీకాళహస్తి మండలానికి చెందిన వైసీపీ నేత, వారి బంధువులు ఈ ఏడాది జనవరి 9న ఫైల్‌ను తన వద్దకు తెస్తే కాదన్నానన్నారు. తహసీల్దారు సంతకాలు పెట్టమని చెప్పినా నిరాకరించానన్నారు. అప్పటి ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ఫోన్ చేసి బెదిరించడంతో తప్పనిసరి పరిస్థితిలో భూముల మార్పు ఫైలు మీద సంతకం చేశానన్నారు. ఇందుకు తాను ఒక్క పైసా కూడా తీసుకోలేదని స్పష్టం చేశారు.

సినీనటుడు చిరంజీవికి సాదర వీడ్కోలు



చిరంజీవితో కోలా ఆనంద్,వినుత

రేణిగుంట, ఆగస్టు 22: ప్రముఖ సినీనటుడు చిరంజీవికి రేణిగుంట విమానాశ్రయంలో సాదర వీడ్కోలు లభించింది. తన జన్మదినం సందర్భంగా ఆయన గురువారం కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అనంతరం విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడ ఆయనకు బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, నియోజవకర్గ జనసేన ఇన్‌ఛార్జి వినుత, చంద్రబాబు సత్కరించి వీడ్కోలు పలికారు.

వేడుకగా ఎల్లమ్మ ఆలయ మహాకుంభాభిషేకం



ఎల్లమ్మ ఆలయంలో కలశస్థాపన, పూజలు

ఏర్పేడు, ఆగస్టు 22: బాలకృష్ణాపురంలో ఎల్లమ్మ ఆలయ మహాకుంభాభిషేక వేడుకలు ఘనంగా నిర్వహించారు. తిరుపతికి చెందిన రాజారెడ్డి ఆధ్వర్యంలో మహాకుంభాభిషేకం, విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమాలు జరిగాయి. బుధవారం రాత్రి ఎల్లమ్మ ప్రతిమలతో పాటు శూలం వేంచేపు జరిగింది. గురువారం ఉదయం వేదపండితులు శాస్త్రోక్తంగా హోమం, నవగ్రహ కలశస్థాపన చేశారు. కుంభం, ఇతర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఎల్లమ్మ జాతర కార్యక్రమానికి శ్రీకారం చుట్టేవరకు ఆలయం, గ్రామం పవిత్రంగా ఉండేలా చూడాలని గ్రామస్తులకు రాజారెడ్డి సూచించారు. రామదాను, శేఖర్‌యాదవ్, మునిరత్నంనాయుడు, ఊటి చంద్రశేఖర్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

అంగన్వాడీ భవన నిర్మాణానికి సహకారం



ఎస్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్ నిర్మించిన అంగన్వాడీ భవనం - ప్రారంభిస్తున్న ఎండీ హాజీమే కజోకా

శ్రీసిటీ, ఆగస్టు 22: శ్రీసిటీ పరిధిలోని గొల్లవారిపాళెంలో ఎస్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్ పరిశ్రమ వితరణతో నిర్మించిన అంగన్వాడీ భవనాన్ని ఆ సంస్థ ఎండీ హాజీమే కజోకా గురువారం ప్రారంభించారు. ఈ సంస్థ సీఆర్ఎస్ కింద రూ.35 లక్షలతో భవనం నిర్మించింది. భవనంతో పాటు మరుగుదొడ్లు, ప్రహరీ గోడ నిర్మించింది. ఫర్నిచర్, టీవీ, ఆట వస్తువులను సమకూర్చింది. ఇందుకు అవసరమైన భూమిని శ్రీసిటీ సమకూర్చింది. ప్రారంభ కార్యక్రమంలో ఎస్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్ అసిస్టెంట్ మేనేజింగ్ డైరెక్టర్ తకావో ఇకరాషి, సీనియర్ ఎగ్జిక్యూటివ్స్ సంజయ్ ఆనంద్, మల్లేశ్వరన్, సాయికృష్ణ, శ్రీసిటీ ప్రతినిధులు రమేష్‌కుమార్, రమేష్, సురేంద్రకుమార్, సర్పంచ్ పార్వతి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.12 కోట్లు

తిరుమల, ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.12 కోట్లు లభించింది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ బుధవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు రూ.4.12 కోట్లు ఆదాయం లభించినట్టు టీటీడీ గురువారం ఉదయం ప్రకటించింది. బుధవారం 74,957 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 33,066 మంది భక్తులు శ్రీవారికి తలనీలాలు సమర్పించారు.

సీఐల బాధ్యతల స్వీకారం




రవినాయక్- బీవీ శ్రీనివాసులు

వరదయ్యపాళెం, ఆగస్టు 22: శ్రీసిటీ సీఐగా బీవీ శ్రీనివాసులు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇప్పటివరకూ తిరుపతి పోలీస్ కమాండ్ కంట్రోల్ విభాగంలో పనిచేశారు. గతంలో సత్యవేడు ఎస్ఐ, సీఐగా కూడా పనిచేశారు. ఆయనను టీడీపీనేతలు ఆదిముత్యం నందకిషోర్‌రెడ్డి, మునిచంద్రారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి రూరల్ సీఐగా రవినాయక్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందుఆయన ముక్కంటి ఆలయాన్ని దర్శించుకున్నారు.

ఘనంగా చెంగాళమ్మ పరమేశ్వరి గ్రామోత్సవం



పొంగళ్లు పెడుతున్న మహిళలు

వరదయ్యపాళెం, ఆగస్టు 22: మండలకేంద్రంలో చెంగాళమ్మ పరమేశ్వరిగ్రామోత్సవం,తిరునాళ్ల గురువారం వేడుకగా నిర్వహించారు. గోపూజతో శ్రీకారం చుట్టారు. మాజీ సర్పంచ్ బొప్పల తిలక్ ఆధ్వర్యంలో వేదమంత్రాలతో గోమాతను పూజించి పట్టణంలో డప్పుమేళాలతో ఊరేగించారు. సాయంత్రం బస్టాండు వద్ద సిద్దులయ్య స్వామికి మహిళలు పొంగళ్ల నైవేద్యంగా సమర్పించి మొక్కులను తీర్చుకున్నారు.

ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం

సత్యవేడు, ఆగస్టు 22: సత్యవేడు ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా రామచంద్రయ్య, ఉపాధ్యక్షుడిగా నాగరాజు, కార్యదర్శిగా సోము ఎన్నికయ్యారు.

నేడు పంచాయతీల్లో గ్రామసభలు

సత్యవేడు/శ్రీకాళహస్తి, ఆగస్టు 21: సత్యవేడు, శ్రీకాళహస్తి నియోజకవర్గాల పరిధిలోని గ్రామ పంచాయతీల్లో శుక్రవారం గ్రామ సభలు నిర్వహించనున్నారు. మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనుల గుర్తింపు, ప్రభుత్వ పథకాల అమలుపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ సభలు వేదికగా నిలుస్తాయని మండల ఎంపీడీవోలు తెలిపారు. పంచాయతీల సెక్రటరీలు ఆయా సర్పంచ్‌ల ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించనున్నారు. గ్రామాల్లో ముందుగా దండోరా వేసి సభలకు ప్రజలు వచ్చేలా ఏర్పాట్లు చేయాలని అధికారులు కోరుతున్నారు. గ్రామాభివృద్ధికి అవసరమైన పనులను ప్రజలు గుర్తించాలని కోరుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక పంచాయతీలకు జవసత్వాలు సమకూర్చుతున్న నేపథ్యంలో ఈ గ్రామసభలు కీలకం కానున్నాయి. గతంలో పంచాయతీలు ఉనికి కోల్పోయాయి.

ముక్కంటి ఆలయానికి టమోటాల వితరణ



శ్రీకాళహస్తి, ఆగస్టు 22: శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన కేంద్రానికి గురువారం పుంగనూరుకు చెందిన మోహన్‌యాదవ్, మల్లి యాదవ్, మనోహర్ అనే భక్తులు రూ.లక్ష విలువైన మూడు టన్నుల టమోటాను వితరణ చేశారు. వీటిని ఆలయ ఈవో ఎన్‌వీఎస్ఎన్ మూర్తి స్వీకరించి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. వారికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా సరస్వతి విగ్రహ ప్రతిష్ట



శ్రీకాళహస్తి, ఆగస్టు 22: పట్టణంలో ఎస్పీవీ జూనియర్ కళాశాలలో గురువారం సరస్వతిదేవి విగ్రహ ప్రతిష్ఠ శాస్త్రోక్తంగా జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్‌రెడ్డి సొంత నిధులతో సరస్వతిదేవి విగ్రహ ప్రతిష్ఠను నిర్వహించారు. విద్యార్థులు, బోధనేతర సిబ్బందికి భోజన వసతి కల్పించారు. 31న ఆయన రిటైర్ కానున్నారు.

పుత్తూరు వార్తలు

కృష్ణుడి విగ్రహ ప్రతిష్ట త్రిదిన మహోత్సవం



హోమాది క్రతువులో పాల్గొన్న వాసుదేవానంద స్వామి

వడమాలపేట, ఆగస్టు 22: గ్రామాలు సుభిక్షంగా ఉండడం కోసం యజ్ఞ యాగాది క్రతువులు నిర్వహించాలని నాయుడుపేట వాసమ్మ ఆశ్రమానికి చెందిన వాసుదేవానందస్వామి చెప్పారు. వడమాలపేట కావలివీధిలో గురువారం జరిగిన కృష్ణ విగ్రహ ప్రతిష్ఠ త్రిదిన మహోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు ఎస్ఆర్‌బాలు చమర్తి రాజు, శిరీషలు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. జలాదివాసం పూర్ణాహుతి, గ్రామ ప్రదక్షిణ, శిఖర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ, అధార పీఠ పూజలు నిర్వహించారు.

ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పించుకోవద్దు

- అధికారులకు ఎమ్మెల్యే భాను హితవు



సమావేశంలో సబ్ రిజిస్ట్రార్ యోగానంద్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్

పుత్తూరు టౌన్, ఆగస్టు 22: ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతికి ఆస్కారం లేకుండా పారదర్శక పాలన అందించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ పేర్కొన్నారు. గురువారం పుత్తూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల్లో తన పేరుతో ఎవరు వసూళ్లకు పాల్పడినా సహించేది లేదని స్పష్టం చేశారు. ప్రజలను పదే పదే తిప్పించుకుని ఇబ్బందులకు గురి చేయడం వంటివి తగదన్నారు. శిథిలావస్థకు చేరుకున్న రికార్డు గదిని పరిశీలించారు. కొత్త భవన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని సూచించారు. నిర్మాణంలో ఉన్న అన్న క్యాంటీన్ పనులను పరిశీలించారు. సబ్ రిజిస్ట్రార్ యోగానంద్, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, కార్యాలయ సిబ్బంది, డాక్యుమెంట్ రైటర్లు, టీడీపీ నాయకులు డీఎన్ ఏలుమలై, టీడీపీ పట్టణ అధ్యక్షులు జీవరత్నం నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎన్ఎన్.ధనపాల్, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు షణ్ముగ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ యుగంధర్, గాలి గోపీనాథ్, బాబునాయుడు, వీక్కిరాయల్, కరుణాయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

చెత్త నిల్వలపై ఆందోళన



బాలికల జూనియర్ కళాశాల వద్ద పేరుకున్న చెత్తా చెదారం

పుత్తూరు టౌన్, ఆగస్టు 22: రోడ్డుపై చెత్త చెదారాలతో తొట్టెలు నిండిపోయినా మున్సిపల్ అధికారులకు పట్టడంలేదని పట్టణ ప్రజలు వాపోతున్నారు. పట్టణంలో అక్కడక్కడ చెత్తకుండీలన్నీ చెత్తతో నిండిపోయి కనిపిస్తున్నాయి. ఎవరైనా వెళ్లి అడిగితే తప్ప స్పందించడంలేదని వారు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. బాలికల జూనియర్ కళాశాల, జెండామాను ఎక్స్‌టెన్షన్ వద్ద వారం రోజులుగా చెత్తకుప్పలు తొలగించలేదు. కుళ్లిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. అంటురోగాలు ప్రబలే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు.